

శోభాయాత్రకు బయలుదేరిన కోదండరాముడు



శోభాయాత్ర సందర్భంగా భక్తజనంతో కిక్కిరిసిన అప్సరా సర్కిల్

వేడుకగా శోభాయాత్ర

- రామయ్యను చూసేందుకు పోటెత్తిన జనం
- యాత్ర పొడవునా రెట్టించిన ఉత్సాహంతో భక్తజనం
- కడపలో మార్మోగిన జైశ్రీరామ్ నామధేయం
- ఆకట్టుకున్న పలు సాంస్కృతిక కార్యక్రమాలు
- కనుల పండువగా సీతారాముల కల్యాణం

4

అయోధ్యలో బాలరాముడు కొలువుదీరి ఏడాది అయిన సందర్భంగా.. కడప నగరంలో బుధవారం రాములోరి శోభాయాత్ర అత్యంత వేడుకగా నిర్వహించారు. ఉదయం సీతారాముల కల్యాణం కనులపండువగా సాగింది. అనంతరం కోదండరాముడి భారీ విగ్రహంతో చేపట్టిన శోభాయాత్రతో నగరమంతా జైశ్రీరామ్ నామంతో మారుమోగింది. యాత్ర సాగినంత మేరా భక్తజనసంద్రంగా మారింది.

బార్లా.. బ్రాందీషాపులా..?

- బద్వేలులో బార్‌లను తలపిస్తున్న మద్యం షాపులు
- నిబంధనలు బేఖాతర్
- ఊరూరా బెల్టుషాపులు
- చోద్యం చూస్తున్న అధికారులు

బద్వేలు పట్టణంలో బార్లకు, బ్రాందీషాపులకు తేడా కనిపించడం లేదు. ఎక్సైజ్‌శాఖ నిబంధనలు ఎవరూ పట్టించుకోవడం లేదు. నాణ్యమైన మందు తక్కువ ధరకే ఇస్తున్నట్లు ప్రభుత్వ పెద్దలు ప్రచారం చేస్తున్నారు. అయితే మద్యం విక్రయాలలో విచ్చలవిడిగా నిబంధనలు ఉల్లంఘిస్తున్నా పట్టించుకోవడం లేదు. దీంతో బ్రాందీషాపుల యజమానులు వారి ఇష్టారాజ్యంగా మద్యాన్ని విక్రయిస్తూ షాపులోనే సిట్టింగ్ నిర్వహిస్తూ బార్లను తలపించేలా వ్యాపారాలు సాగిస్తున్నారు. దీంతో మందుబాబులు ఎక్కడ షాపు ఉంటే అక్కడే యథేచ్ఛగా మద్యం తాగుతూ నిషాలో తూలుతున్నారు.



బద్వేలు పట్టణంలోని ఓ బ్రాందీషాపులో మద్యం తాగుతున్న దృశ్యం

బద్వేలు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): బద్వేలు నియోజకవర్గంలో 15 వైన్‌షాపులు ఉన్నాయి. ఇందులో బద్వేలులో 2 బార్లు, పోరుమామిళ్లలో ఒక బార్ ఉంది. బార్ యజమానులు కూడా తెల్లవారు జామునే బార్లు తెరిచి అమ్మకాలు సాగిస్తున్నట్లు మందుబాబులు తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అయితే ఇప్పుడు బ్రాందీషాపులలో ఎక్కడా మద్యం సేవించరాదు. అక్కడ అవసరమైన మద్యాన్ని కొనుక్కుని బయటకు వెళ్లి తాగాల్సిందే. అయితే బద్వేలులో ఈ నిబంధనలేవీ పాటించడం లేదు. మద్యంషాపుల్లోనే సిట్టింగ్ చేయిస్తూ ఇష్టారాజ్యంగా వ్యాపారాలు సాగిస్తున్నారు. ఇక్కడే మంచింగ్‌కు అవసరమైన తిరుబండారాలు కూడా విక్రయిస్తున్నారు. వాటర్ బాటిల్స్, పాకెట్లు, గ్లాసులు, తినుబండారాలు విక్రయించడంతో పాటు అక్కడే చికెన్ పకోడా బండ్లు ఏర్పాటు చేసుకుని మద్యం వ్యాపారం సాగిస్తున్నారు. దీంతో బ్రాందీషాపులే బార్లను తలపిస్తున్నాయి.

పర్మిట్ రూములు లేకున్నా

బ్రాందీషాపుల పక్కనే చిన్నపాటి పర్మిట్ రూములు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అవకాశం ఇచ్చే పరిస్థితులు ఉన్నట్లు తెలుస్తున్నా ఇప్పటివరకు ఇలాంటివి రాష్ట్రంలో ఎక్కడ కూడా ఏర్పాటు చేయలేదు. అయినా బద్వేలులో పర్మిట్ రూములతో పని ఏంటి బ్రాందీషాపులే పర్మిట్ రూములు, బార్లు అన్నట్లుగా షాపుల యజమానులు మద్యం విక్రయాలు సాగిస్తున్నారు.

విచ్చలవిడిగా బెల్టుషాపులు

మద్యం షాపులు దక్కించుకున్న యజమానులు అధిక సంపాదనకు దిగారు. బ్రాందీ షాపుల నిబంధనలను పక్కనపెట్టి నడిపించడమే కాదు, ఆ బ్రాందీషాపుల పరిసర గ్రామాలలో పెద్ద ఎత్తున బెల్టుషాపులు ఏర్పాటు చేయించుకున్నారు. కొన్ని గ్రామాలు కొందరు, మరికొన్ని గ్రామాలు ఇంకొందరు అన్నట్లు బెల్టుషాపులు ఏర్పాటు చేసుకుని సరుకు సరఫరా చేస్తున్నారు. బెల్టుషాపుల్లో అధిక రేట్లకు మద్యం విక్రయిస్తున్నారు. దీంతో గ్రామ గ్రామాన ఇప్పుడు మద్యం వాసనలు గుప్పుమంటున్నాయి. ఇలా నిబంధనను పక్కనపెట్టి ఇష్టారాజ్యంగా మద్యం విక్రయాలు నిర్వహిస్తున్నా ఎక్సైజ్ అధికారులు కానీ, ఇటు పోలీసులు గాని వాటిపై దృష్టిపెట్టలేదు. దీంతో మద్యం షాపుల యజమానులకు అడ్డూ అదుపులేకుండా పోయింది. విచ్చలవిడిగా మద్యం లభించడంతో తాగేవారి సంఖ్య పెరుగుతోంది. దీంతో ఆయా ప్రాంతాలలో అలజడులు, గొడవలకు దారితీసే పరిస్థితులు లేకపోలేదు.



నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవు..

వైన్ షాపు యజమానులు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి. ఎమ్మార్పీకే మద్యం విక్రయించాలి. వైన్‌షాపుల వారికి ప్రభుత్వం ఎలాంటి పర్మిట్ రూము అనుమతించలేదు. వైన్‌షాపులో మద్యం సేవించరాదు. అక్కడ మద్యం సేవిస్తే చట్టపరమైన చర్యలు చేపడతాం. బార్లు, వైన్ షాపు యజమానులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలి. ఎవరైనా బెల్టుషాపులు నిర్వహించి మద్యం విక్రయాలు చేస్తే కేసులు నమోదు చేసి జైలుకు పంపుతాం. బెల్టుషాపులపై ప్రత్యేక దృష్టి సారించాం.

- సీతారామిరెడ్డి, ఎక్సైజ్ సీఐ, బద్వేలు

ప్రొద్దుటూరు డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన భావన



ప్రొద్దుటూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు డీఎస్పీగా పూతి భావన బాధ్యతలు చేపట్టారు. ఆమేరకు బుధవారం ఆమె డీఎస్పీ కార్యాలయానికి రాగా పోలీసు అధికారులు, సిబ్బంది స్వాగతం పలికారు. వైజాగ్‌కు చెందిన పూతి భావన 2022 గ్రూప్-1 బ్యాచ్‌కు చెందిన అధికారి. ఇటీవలే శిక్షణ పూర్తి చేసుకుని, మొదటి పోస్టింగ్ ప్రొద్దుటూరులో దక్కించుకున్నారు. ఇక్కడ పనిచేస్తున్న డీఎస్పీ భక్త వత్సలం విజయవాడలోని పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్టు చేసుకున్నారు.

బాధ్యతలు చేపట్టిన డీఈఓ షంషుద్దీన్



కడప ఎడ్యుకేషన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్యాశాఖాధికారిగా డాక్టర్ షేక్ షంషుద్దీన్ బుధవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా ఆయన కలెక్టరేట్‌లో కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం తన కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. కర్నూలు జిల్లా బి.తాండ్రపాడు డైట్ కళాశాలలో సీనియర్ అధ్యాపకులుగా పనిచేస్తున్న ఈయనను ప్రభుత్వం వైఎస్సార్ కడప జిల్లా విద్యాశాఖాధికారిగా నియమించింది. 1995లో కర్నూలు జిల్లా బేతంచెర్ల మండలం గోరుమానుకొండ తండా ఎంపీటీ పాఠశాలలో ఎస్జీటీగా విధుల్లో చేరారు. 1998లో స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యారు. 2001లో రాయచోటి డైట్ కళాశాల లో సైకాలజీ అధ్యాపకుడిగా పనిచేశారు. డిప్యుటేషన్‌పై ఎస్‌సీఈఆర్‌టీలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వహించారు. ప్రస్తుతం కడప డీఈఓగా ప్రభుత్వం నియమించింది.

లారీ డ్రైవర్‌పై పోలీసుల దాడి

- కాలు విరిగేలా కొట్టారంటూ విలపించిన బాధితుడు

4

మధ్యాహ్న భోజనం తనిఖీ

- ఆహారం తయారీపై కలెక్టర్ ఆరా

జమ్మలమడుగు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మండలం దేవగుడి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో విద్యార్థులకోసం తయారు చేసిన మధ్యాహ్న భోజనాన్ని కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ బుధవారం తనిఖీ చేశారు. అక్కడ తయారవుతున్న ఆహార పదార్థాలకు సంబంధించి వంట ఏజెన్సీ వారితో మాట్లాడారు. అనంతరం మోరగుడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వంట ఏజెన్సీని పరిశీలించారు. తర్వాత పట్టణంలోని పతంగే రామన్నరావు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులతో మాట్లాడారు. నాలుగు వేల మంది విద్యార్థులకు నాణ్యమైన ఆహారం తయారు చేయాలంటే ఎంత సమయం పడుతుందని, అందుకు తగిన వంట పాత్రలు, వసతులపై అడిగారు. చుట్టుపక్కల 227 పాఠశాలలకు పీఆర్ హైస్కూలు ఆవరణంలో, అలాగే దేవగుడిలో 11 పాఠశాలలకు, మోరగుడిలో 20 పాఠశాలలకు ఆహారాన్ని తయారు చేసి పంపించేందుకు ఏర్పాట్ల పరిశీలన జరుగుతోందని స్థానిక విద్యాశాఖ అధికారి, పీఆర్ హైస్కూలు హెడ్మాస్టర్ రమణారెడ్డి, చంద్రశేఖర్‌రావు తెలిపారు. కలెక్టర్ వెంట డీఈవో మీనాక్షి, ఆర్డీవో సాయిశ్రీ, తహశీల్దారు శ్రీనివాసరెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ ముద్దనూరు రోడ్డులోని ఇరిగేషన్ శాఖకు సంబంధించిన స్థలాన్ని పరిశీలించారు. ఇటీవల జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి వందపడకల ఆస్పత్రి నిర్మాణం చేపట్టాలని ప్రయత్నిస్తున్నారు. ఇక్కడున్న ప్రభుత్వ ఆస్పత్రి 30 నుంచి 50 పడకలకు చేరింది. దీనిని వంద పడకల స్థాయికి పెంచేందుకు ఎమ్మెల్యే కృషి చేస్తున్నారు. అందులో భాగంగా ఆస్పత్రి నిర్మాణం కోసం రెండు చోట్ల స్థలాన్ని పరిశీలించారు. చివరకు ఇరిగేషన్ శాఖకు సంబంధించిన స్థలంలో వసతి ఉంటుందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో బుధవారం కలెక్టర్ ఆ స్థలాన్ని పరిశీలించారు.



పీఆర్ హైస్కూలు వద్ద వంట ఏజెన్సీ వారితో మాట్లాడుతున్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

యోగి వేమన వర్సిటీలో రోడ్డు పనులపై విచారణ కమిషన్ ఏర్పాటు

కలికిరి/కడప ఎడ్యుకేషన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): యోగి వేమన యూనివర్సిటీలో గతంలో జరిగిన రోడ్లు, మురుగునీటి కాలువల పనుల్లో జరిగిన అవకతవకలపై ప్రాథమిక ఆధారాలు నిర్ధారణ కావడంతో దీనిపై పూర్తిస్థాయి విచారణ కోసం కమిషన్‌ను నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఆదేశాలు జారీ చేసింది. 2018లో ఈ అవకతవకలపై ప్రభుత్వం బాధ్యుల నుంచి సంజాయిషీలు కోరింది. ఆ తరువాత ఈ వ్యవహారం మరుగున పడింది. తాజాగా అప్పట్లో పనులను పర్యవేక్షించిన కడప ఆర్అండ్‌బీ ఈఈ జె.నరసింహులు నాయుడు, తిరుపతి ఆర్అండ్‌బీ ఏపీఆర్డీసీ సబ్ డివిజన్ డీఈఈ జి.ప్రభాకర రావు, కడప ఆర్అండ్‌బీ ఏఈఈ సి.రాజేంద్రప్రసాద్‌ల పైన విచారణ నిర్వహించడానికి ఆర్అండ్‌బీ క్వాలిటీ కంట్రోల్ చీఫ్ ఇంజినీరు జి.వెంకటేశ్వర రావును విచారణాధికారిగా నియమించింది. విచారణలో సహకరించి అవసరమైన రికార్డులను అందజేయడానికి కడప సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజినీరు జి.చంద్రశేఖర్‌ను ప్రెజెంటింగ్ అధికారిగా ఏర్పాటు చేసింది. ఈ మేరకు రాష్ట్ర రవాణా, రోడ్లు భవనాల శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే బుధవారం వేర్వేరుగా రెండు ఉత్తర్వులు జారీ చేశారు.

కడప నుంచి నంద్యాలకు డీజీపీ

కడప క్రైం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా పర్యటనలో భాగంగా డీజీపీ ద్వారకా తిరమలరావు మంగళవారం కడపకు చేరుకున్నారు. రాత్రి పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించి ఆర్అండ్ బీ గెస్ట్ హౌస్‌లో బస చేసిన సంగతి తెలిసిందే. బుధవారం ఉదయం ఆయన జిల్లా పోలీస్ అధికారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం రోడ్డు మార్గాన నంద్యాల జిల్లాకు వెళ్లారు. ఆయనతో పాటు కర్నూలు రేంజి డీఐజీ కోయ ప్రవీణ్ వెళ్లారు. అంతకు ముందు డీజీపీని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, మర్యాదపూర్వకంగా కలిసి జిల్లా సమస్యలపై వివరించారు.

సీఎం హామీలు అమలు

- పారిశుధ్య కార్మికులకు రూ.లక్ష నగదు బహుమతి
- అందజేసిన కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

5

వేడుకగా శోభాయాత్ర



- రామయ్యను చూసేందుకు పోటెత్తిన జనం
- యాత్ర పొడవునా రెట్టించిన ఉత్సాహంతో భక్తజనం
- కడపలో మార్మోగిన జైశ్రీరామ్ నామధేయం
- ఆకట్టుకున్న పలు సాంస్కృతిక కార్యక్రమాలు
- కనుల పండువగా సీతారాముల కల్యాణం

కడప కల్చరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కడప నగరంలో రాములోరి మహా శోభాయాత్ర అత్యంత వేడుకగా సాగింది. శ్రీరామచంద్రమూర్తి అయోధ్యలో బాల రాముడుగా కొలువుదీరి సరిగ్గా ఏడాది పూర్తి అయిన సందర్భంగా.. అయోధ్య ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 11 గంటలకు నగర మునిసిపల్ మైదానం నుంచి శోభాయాత్ర సాగింది. ఇందులో భాగంగా కోదండరాముడి భారీ విగ్రహాన్ని ప్రత్యేకంగా రూపొందించిన శ్రీరామరథంపై కొలువుదీర్చారు. ఒక చేతిలో బాణం, మరో చేతిలో ధనస్సు చేతబూనిన దివ్య మంగళరూపంతో జగదభిరాముడి శోభాయాత్ర నిర్వహించారు.

అడుగడుగునా భక్తజనం ఉత్సాహంతో అలుపు సొలుపు లేకుండా ముందుకు కదిలారు. శోభాయాత్రలో శ్రీరామచంద్రుడి విగ్రహం చూసేందుకు పుర వీధులు భక్తజనంతో పోటెత్తాయి. మున్సిపల్ మైదానం నుంచి బయలుదేరిన శోభాయాత్ర శంకరాపురం, అప్సరా సర్కిల్, ఎన్జీవో కాలనీ, వై.జంక్షన్ మీదుగా ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్‌సర్కిల్ వద్దకు మధ్యాహ్నం 2 గటలకు చేరుకుంది. అక్కడ భక్తుల కోసం సండే గ్రూప్ సభ్యుల సౌజన్యంతో బి.మఠం ఎంపీటీసీ ముత్యాల రామగోవిందరెడ్డి సారథ్యంలో అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. భక్తులు అన్న ప్రసాదం స్వీకరించి తిరిగి నూతనోత్తేజంతో శోభాయాత్రలో ముందుకు సాగారు. ఎస్పీ బంగళా, రాజారెడ్డి వీధి, కో-ఆపరేటివ్ కాలనీ, అన్నమయ్య సర్కిల్, క్రిష్ణా సర్కిల్, గోకుల్ సర్కిల్, వన్‌టౌన్ గాంధీ విగ్రహం, పాతబస్టాండ్, 7రోడ్స్, ఇందిరమ్మ సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్, కోటిరెడ్డి సర్కిల్, కాగితాలపెంట, ఐటీఐ సర్కిల్, సంధ్యాసర్కిల్, యర్రముక్కపల్లె సర్కిల్, రాజీవ్ పార్క్ మీదుగా హౌసింగ్ బోర్డు కాలనీలోని కోదండరామాలయం వరకూ శోభాయాత్ర సాగింది.

శోభాయాత్ర ఆద్యంతం భక్తులు జై శ్రీరామ్ అంటూ నినదించారు. పిల్లలు, పెద్దలు, యువకులు, వృద్ధులు, మహిళలు, యువతులు అనే తేడా లేకుండా రాములోరి శోభాయాత్రలో అడుగులు కలిపారు. శోభాయాత్ర సాగుతున్న ప్రదేశాలలో పలుచోట్ల భక్తులకు దాతలు అన్నప్రసాదాలతో పాటు మంచినీరు, మజ్జిగ ఏర్పాటుచేశారు.



కడప నగరంలో జరిగిన శ్రీరాముల శోభాయాత్రలో పాల్గొన్న అశేష భక్తజనం



శోభాయాత్రలో కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

శోభాయాత్రలో రాములోరి విగ్రహం ముందు భాగాన వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ప్రధానంగా వరంగల్ నుంచి వచ్చిన తప్పెట మహిళా కళాకారులు లయబద్ధంగా వాయించిన వాయిద్యం అలరించింది. శ్రీకాకుళం జిల్లా చీపురుపల్లికి చెందిన పానీల శంకర బృందం తప్పెటగుళ్ల కళాకారులు ప్రదర్శించిన నృత్యం భక్తులను కట్టిపడేసింది. అన్నమయ్య జిల్లా సుండుపల్లెకు చెందిన శ్రీనాగారపమ్మ తల్లి చెక్కభజన గురునాథ్ బృందం ప్రదర్శించిన చెక్కభజన రంజింపచేసింది. కడపకు చెందిన కాలేజీ విద్యార్థినిలు ప్రదర్శించిన కోలాటం, రామనామాల తాళం రంజింప చేశాయి.

ప్రత్యేక ఆకర్షణగా స్వాముల వేషధారణలు

శోభాయాత్రలో శ్రీరాముడు, సీతాదేవి, పార్వతి, పరమేశ్వరుడు, హనుమంతుడు, కాళికామాత తదితర దేవతా మూర్తుల రూపాలలో గుంటూరుకు చెందిక కొంతమంది కళాకారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వారి రూపాలను తిలకించిన భక్తులు రెండుచేతులెత్తి మొక్కుకున్నారు. మరికొంతమంది వారితో ఫొటోలు దిగారు.



శోభాయాత్రలో ప్రత్యేక ఆకర్షణగా హనుమంతుడు

కనుల పండువగా సీతారాముల కల్యాణం

శోభాయాత్రకు ముందు ఉదయం 8 గంటలకు మునిసిపల్ మైదానంలో ప్రత్యేకంగా తీర్చిదిద్దిన వేదికపై నిర్వహించిన సీతారాముల కల్యాణం కనుల పండువగా సాగింది. రాములోరి కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కల్యాణాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో జిల్లా అర్చక పురోహిత సమాఖ్య అధ్యక్షుడు విజయ్‌భట్టర్ సారథ్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో అయోధ్య ఐక్యవేదిక ప్రతినిధులు వెంకటరెడ్డి, కడప ఎంపీ అవినాశ్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆర్.మాధవి, నగర మేయర్ సురేశ్‌బాబు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, కమిషనర్ మనోజ్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి, నాయకులు ఎం. శ్రీనివాసులురెడ్డి, వై.హరినారాయణరావు, మునగా సతీశ్‌కుమార్, బీజెవైఎం జిల్లా అధ్యక్షుడు బొమ్మన విజయ్ తదితరులు పాల్గొన్నారు.





కడప నగరంలోని మున్సిపల్ స్టేడియంలో బుధవారం ఉదయం జరిగిన సీతారాముల కల్యాణంలో మంగళసూత్రాన్ని చూపిస్తున్న అర్చకులు, కల్యాణానికి హాజరైన భక్తులు



కల్యాణోత్సవంలో ప్రత్యేక ఆకర్షణగా కేరళ వాయిద్యాలు

లక్ష మంది చిన్నారులకు సంరక్షణ

- ఐసీడీఎస్ పీడీ రమాదేవి

పీలేరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఉన్న 2275 అంగన్వాడీ కేంద్రాల ద్వారా 0-3 ఏళ్ల మధ్య ఉన్న 1.05 లక్షల మంది చిన్నారులను సంరక్షిస్తున్నట్లు ఐసీడీఎస్ పీడీ రమాదేవి తెలిపారు. పీలేరు పట్టణంలోని యల్లమంద క్రాసు, కావలిపల్లె అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తూ ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా అంగన్‌వాడీ కేంద్రాలకు అందుతున్న పౌష్టికాహారం పక్కదారి పట్టకుండా లబ్ధిదారులకు చేరవేసే బాధ్యత కార్యకర్తలదేనన్నారు. జిల్లాలోని అధిక శాతం అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు ఉన్నాయని, 750 కేంద్రాలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయని, 450 కేంద్రాలు ఎలాంటి అద్దె కట్టాల్సిన అవసరం లేని భవనాల్లో ఉన్నాయని తెలిపారు. 'నాడు-నేడు' పథకం ద్వారా 141 భవనాల పనులు జరుగుతున్నాయని ఆమె వివరించారు. జిల్లా వ్యాప్తంగా ఖాళీగా ఉన్న 143 పోస్టుల్లో 116 పోస్టుల కోసం నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు. మిగిలిన పోస్టులు కోర్టు కేసుల కారణంగా పెండింగ్‌లో ఉన్నాయని, మాతృభాషాభివృద్ధిని అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రారంభించాలన్న తలంపుతో ప్రభుత్వం ప్రతి కేంద్రానికీ తెలుగు అచ్చు పుస్తకాలు అందజేసిందన్నారు. అనంతరం ఆమె ఆయా కేంద్రాల్లోని రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో సీడీపీవో రాజమ్మ, సూపర్‌వైజర్లు అక్కాయమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు ఇందిర, అన్నపూర్ణ, తదితరులు పాల్గొన్నారు.



కేంద్రంలో చిన్నారులతో మాట్లాడుతున్న పీడీ

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు : సీఐ

- ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రైల్వేకోడూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు తీసుకుంటామని రైల్వేకోడూరు సీఐ హేమసుందరరావు తెలిపారు. బుధవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'బెల్టుతీయరా' అనే శీర్షికన కథనం వచ్చింది. దీనికి స్పందించిన పోలీసులు మద్యం దుకాణాల పరిసర ప్రాంతాల్లో బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న వారిపై దాడులు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగరాదన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగే వారిపై కేసులు పెడతామన్నారు. ప్రతి మద్యం దుకాణం యజమాని ప్రభుత్వ నిబంధనలు పాటించాలని తెలిపారు. ప్రతి దుకాణం వద్ద బార్‌లాగా ఏర్పాటు చేసి తాపిస్తున్నారని దానిపై కూడా దాడులు చేస్తామని హెచ్చరించారు. దాడుల్లో ఎస్ఐ నవీన్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

లారీ డ్రైవర్‌పై పోలీసుల దాడి

కాలు విరిగేలా కొట్టారంటూ విలపించిన బాధితుడు



పోలీసుల దెబ్బలకు కాలు విరిగిన లారీ డ్రైవర్ నహీద్, డ్రైవర్ చొక్కాపట్టుకుని లాక్కెళుతున్న సీఐ

మదనపల్లెఅర్బన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఝార్ఖండ్ రాష్ట్రం ధన్‌బాద్‌కు చెందిన ఎండీ నహిద్ సత్యసాయి జిల్లా కదిరిలో ఓ లారీ యాజమాని వద్ద డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి కదిరి నుంచి తమిళనాడు రాష్ట్రం ఈరోడ్‌లోని పేపర్‌మిల్లుకు కలపను లారీలో వేసుకుని రాత్రి 11.45 గంటలకు మదనపల్లె చేరుకున్నాడు. మదనపల్లె తాలుకా పోలీసులు జాతీయ రహదారిలో లారీని ఆపి రికార్డులను చూపమని చెప్పడంతో తెలుగు రాని డ్రైవర్ అర్థం కాక అక్కడే ఉండిపోయాడు. క్యాబిన్‌లోని రికార్డులు వెతుకుతుండగా పోలీసులు విచక్షణారహితంగా కాళ్లపై కొట్టడంతో ఎడమకాలు విరిగి స్పృహ కోల్పోయాడని తోటి డ్రైవర్ చెప్పాడు. కనికరం లేకుండా పోలీసులు మరో రెండు తగిలించండి అంటూ మళ్లీ కొట్టారని నహీద్ అతడు తెలిపాడు. వెనుక వస్తున్న మరో లారీ డ్రైవర్ మహబూబ్‌బాష పోలీసులను ప్రాధేయపడి నహీద్‌కు అండగా నిలిచాడు. బుధవారం ఉదయం లారీ యూనియన్ల నాయకులకు జరిగిన విషయం చెప్పి చికిత్స కోసం మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకొచ్చారు. పరీక్షించిన వైద్యులు ఎడమకాలు విరిగిందని చెప్పారు. ఈ విషయం పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడానికి లారీ యూనియన్ సభ్యులు సిద్ధం అవుతున్న క్రమంలో జిల్లా ఆస్పత్రి వద్దకు తాలుకా సీఐ కళావెంకటరమణ తన సిబ్బందితో అక్కడికి చేరుకుని ప్రత్యక్ష సాక్షిగా ఉన్న మరో డ్రైవర్ మహబూబ్‌బాషను చొక్కా పట్టుకుని లాగే ప్రయత్నం చేశాడు. దీంతో లారీ యూనియన్ నాయకులు మదనపల్లె డీఎస్పీకి సీఐపై ఫిర్యాదు చేశారు. ఈ విషయంగా తాలుకా సీఐ కళావెంకటరమణను వివరణ కోరగా డ్రైవర్లు తమ కానిస్టేబుల్‌ను కాలర్ పట్టుకున్నారని, ఈ విషయం తాను వారికి చెబుతున్నా వినకుండా తనను కూడా లెక్క చేయకుండా వారు మాట్లాడినట్లు తెలిపారు. రూట్‌పై అక్రమ వాహనాలను అరికట్టడానికి మేము ప్రయత్నం చేశామని తెలిపారు. రక్షణ కల్పించే పోలీసులపైనే దాడికి ప్రయత్నించడం తప్పు కాదా అని ప్రశ్నించారు.

అర్జీల పరిష్కారంపై క్షేత్రస్థాయిలో పరిశీలన

రామాపురం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీల పరిష్కారం ఎలా జరుగుతుందో తెలుసుకోవడానికి కలెక్టర్ చామకూరి శ్రీధర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రామాపురం మండలంలో జరిగిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన కొన్ని అర్జీలను పరిశీలించేందుకు బుధవారం ఉదయం రామాపురం మండలాన్ని కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సదస్సుల్లో వచ్చిన అర్జీల పరిష్కారాల గురించి రామాపురం మండల తమసీల్దార్‌కు సూచనలు చేశారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

త్రీడీ ప్రింటర్లకు ఫ్యూజ్డ్ ఫిలమెంట్

- మిట్స్ విద్యార్థుల ప్రతిభ

కురబలకోట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : త్రీడీ ప్రింటర్ల అభివృద్ధి కోసం ఫ్యూజ్డ్ ఫిలమెంట్‌ను విద్యార్థులు తయారుచేశారు. బుధవారం మండలంలోని అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఫైనలియర్ మెకానికల్ విభాగానికి చెందిన రూపశ్రీ ఒజా పర్యవేక్షణలో విద్యార్థులు ఆదిల్, చైతన్య, వై.దినేష్‌రెడ్డి, జయసూర్య, మహేంద్రాలు ప్లాస్టిక్ సంచులు, వాటర్‌బాటిల్స్‌ను ఉపయోగించి ఫిలమెంట్‌ను తయారు చేశారు.

నిరుపయోగంగా ఉన్న వ్యర్థాలను ఉపయోగించి త్రీడీ ప్రింటర్స్‌కు అనుగుణంగా తక్కువ ఖర్చుతో తయారు చేశారు. త్రీడీ ప్రింటర్స్‌ను కార్యాలయాలు, విద్యాసంస్థలు తదితర వాటిలో దీనిని ఎక్కువగా ఉపయోగిస్తారు. దీని ద్వారా పర్యావరణానికి ఎ టువంటి ఆటంకం లేకుండా దీనిని రూపొందించారు. ప్రాజెక్టును రూపొందిన విద్యార్థులను కరస్పాండెంట్ ఎన్.విజయభాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తీ నాదెళ్ల, ప్రిన్సిపాల్ యువరాజ్, విభాగాధిపతి భాస్కరన్ తదితరులు అభినందించారు.



ప్రాజెక్టును ప్రదర్శిస్తున్న విద్యార్థులు

తాత్కాలిక పనులకే పరిమితమా..?

- గండ్లు పడిన చెరువులు.. కాల్వలను పట్టించుకోని ప్రభుత్వం
- పంటలు ఎలా సాగు చేయాలని ప్రశ్నిస్తున్న రైతులు

పెద్దమండ్యం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో గండ్లు పడిన చెరువు కట్టలు, ఆయకట్టు సాగు కాల్వలకు తాత్కాలిక మరమ్మతులు, మట్టి పనులకే పరిమితమయ్యాయి. ఐదేళ్లుగా మండలంలో పలు చెరువు కట్టలు, సాగు కాల్వలకు గండ్లు పడడంతో ఆయా చెరువుల ఆయకట్టుదారులు పంటల సాగుకు సుముఖత చూపడం లేదు. ఆయకట్టు భూముల్లో పంట సాగు చేస్తే పంట తుది దశలో చెరువు నీరు పంటకు అందడం కష్టమౌతోందంటున్నారు. గతంలో పంట సాగుతో కోత సమయంలో నీరందక పంటలు ఎండిపోయిన సంఘటనలు ఉన్నాయి.

పెద్దమండ్యం మండలంలో ఈ కోవకు చెందిన చెరువుల సాగు కాల్వలకు తాత్కాలిక మరమ్మతులు చేశారు. ఆయా ప్రాంతంలో చెరువులు నిండిన రైతులు వరి పంటలు సాగు చేయడం లేదు. చెరువు నీరు పుష్కలంగా ఉన్న తాత్కాలిక మరమ్మతులు చేపట్టిన సాగు కాల్వలను నమ్ముకుని పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేయడం లేదు. ఐదేళ్లుగా చెరువు సాగు కాల్వలు శాశ్వత పనులు చేయడంలో వైసీపీ ప్రభుత్వం విఫలమైంది. దీంతో ప్రస్తుతం మండలంలో పలు చెరువులు నిండినా సాగు కాల్వల దుస్థితితో వరి పంటలు పండించుకోలేకపోతున్నారు.

మండలంలోని పెద్దమండ్యం పాతచెరువు, బ్రాహ్మణచెరువు, కుప్పాలకుంటకు వచ్చే వర్షపు నీటి కాల్వకు (పెద్దమండ్యం యల్లమ్మగుడి వద్ద) తాత్కాలిక మరమ్మతులు చేశారు. కలిచెర్ల పాపిరెడ్డి చెరువు గండి పడిన సాగు కాల్వకు తాత్కాలిక మరమ్మతులు చేశారు. బసిరెడ్డిచెరువు మొరవ కాల్వకు గండిపడడంతో తాత్కాలిక మట్టి వేశారు. ఈ చెరువు నీరు ఎర్రగుట్ట చెరువు, ఉప్పరపల్లి చెరువుకు పోతాయి. తాత్కాలిక మట్టి మరమ్మతు పనులు ఆయకట్టు రైతులే చేపట్టారని పలువురు రైతులు తెలిపారు. వర్షాకాలంలో చెరువులకు వర్షపు నీరు చేరినా రైతుల్లో ఉత్సాహం బదులు నిరుత్సాహం కనిపిస్తోంది. గండి పడిన చెరువులకు మరమ్మతులు చేస్తే ఆయకట్టు భూముల్లో పంటలు సాగు చేస్తామని పలువురు రైతులు తెలిపారు. కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుని మండలంలో గండి పడిన చెరువు కట్టలు, కాలువలకు మరమ్మత్తులు చేయాలని రైతులు కోరారు.


బాటవారిపల్లి సమీపంలో బసిరెడ్డి చెరువు కాల్వకు తాత్కాలికంగా మట్టితో చేసిన మరమ్మతులు

పనులకు ప్రతిపాదనలు పంపించాం

- శ్రీనివాసులరెడ్డి, ఇన్‌చార్జ్ ఏఈఈ ఇరిగేషన్

మండలంలోని చెరువు కట్టలు, కాలువలు గండిపడిన 11 చెరువులను గుర్తించాం. ఆ చెరువుల అభివృద్ధి పనులకు రూ.6.5 కోట్ల నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాము. నిధులు మంజూరైన వెంటనే చెరువుల అభివృద్ధి పనులు చేపడతాం.

బకాయిలను చట్టబద్ధంగా వసూలు చేయాలి

కడప రూరల్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): పెండింగ్ బకాయిదారులకు రికవరీ, చట్టపర పద్ధతులను వివరించి బకాయిలను వసూలు చేయాలని స్పెషల్ క్యాడర్ డిప్యూటీ రిజిస్ట్రార్ బి. గుర్రప్ప ఆదేశించారు. డీసీసీబీ కార్యాలయంలో బ్యాంకు సూపర్‌వైజర్లుతో సమీక్షించిన ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు, బ్రాంచిల్లో ప్రాథమిక సహకార పరపతి సంఘాల ద్వారా మంజూరు చేసిన రుణాలు, వాయిదా మీరిన బకాయిలను వసూలు చేయాలన్నారు. మొండిబకాయిలు, బకాయిల చెల్లింపులో నిర్లక్ష్యం చూపిన బకాయిదారుల స్థిర, చరాస్తుల జప్తు, వేలానికి అత్యవసర చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీసీసీ బ్యాంకు అధికారులు నారాయణరాజు, పి.చంద్రశేఖర్, ఆంజనేయులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యాప్రదాత రామసుబ్బన్నకు ఘన నివాళి


రక్తదాన శిబిరంలో రక్తదానం చేస్తున్న ప్రిన్సిపాల్ సుధీర్

వీరపునాయునిపల్లె, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): సంగమేశ్వర విద్యాసంస్థల విద్యాప్రదాత రామసుబ్బన్న 25వ వర్ధంతి సందర్భంగా బుధవారం ఘనంగా నివాళులర్పించారు. సంగమేశ్వర ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది రామసుబ్బన్న చిత్రపటంతో పాఠశాల నుంచి ప్రధాన రహదారిపై ర్యాలీగా స్మృతి మండపం వరకు వెళ్లి సమాధి వద్ద నివాళి అర్పించారు. వీఆర్ఎస్ డిగ్రీ కళాశాల విద్యార్థినీ విద్యార్థులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, నేతాజీ ఎలిమెంటరీ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు, ఎస్‌వీఆర్ఎస్ఎం బీఎడ్ కళాశాల ప్రిన్సిపాల్ రాజేష్, వీఆర్ఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సుధీర్, పులివెందుల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, విశ్రాంత అధ్యాపకులు చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

వీఆర్ఎస్ డిగ్రీ కళాశాలలో రక్తదానం

ఒంటిగారి రామసుబ్బన్న వర్ధంతి సందర్భంగా వీరపునాయునిపల్లె వీఆర్ఎస్ డిగ్రీ కళాశాల ఆవరణలో ఎన్ఎస్ఎస్ యూనిట్ 1, 2 ఆధ్వర్యంలో రక్తదానం శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 107 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. యోగి వేమన విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ కె.కృష్ణారెడ్డి మాట్లాడుతూ రక్తదానం అన్ని దానాల్లో కంటేగొప్పదని ప్రశంసించారు. సంగమేశ్వర విద్యాసంస్థల అధినేత ఒంటిగారి వెంకటసుబ్బానాయుడు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో రామసుబ్బన్న చేసిన విద్యాకృషిని వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ వి.సుధీర్ రక్తదానం చేసిన 107 మంది విద్యార్థులను అభినందించారు. యోగి వేమన విశ్వవిద్యాలయం సీడీసీ డీన్ ప్రొఫెసర్ కె.రఘుబాబు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ కేఎస్‌వీ కృ, ఎంసీఏ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాసులు, పులివెందుల మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శ్రీనివాసులు, డీఎడ్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రాజేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆర్.వేహనరసింహారెడ్డి, బి.స్రవంతి పాల్గొన్నారు. రక్తదాన శిబిరానికి సహకరించిన అధ్యాపక, అధ్యాపకేతర, విద్యార్థినీ, విద్యార్థులకు ప్రత్యేక అభినందనలు ప్రిన్సిపాల్ తెలిపారు. రాత్రి రాక్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో సుజన్‌కుమార్‌చే మ్యాజిక్ షో, మెగా ఈవెంట్ ఢిల్లీ బృందంచే సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ట్యాంకర్ ఢీ.. వ్యక్తి మృతి

దువ్వూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు సమీపంలో నాలుగు లైన్ల రహదారిలో ఒక డాబా ఎదురుగా బుధవారం 18 టైర్ల ట్యాంకర్ ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. డాబా వద్ద నుంచి రోడ్డు దాటుతుండగా ఈ సంఘటన జరిగింది. మృతుని శవం నుజ్జు అవడంతో ఎవరు అనే విషయాన్ని పోలీసులు గుర్తుపట్టలేకపోయారు. ట్యాంకర్‌ను అదుపులోకి తీసుకుని మృతుని వివరాల కోసం ఆరా తీస్తున్నారు. మృతదేహాన్ని సంచిలో కట్టి పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కట్నం కోసం వేధింపులు

చాపాడు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లవోలు గ్రామానికి చెందిన చెట్టూరి అఖిల (23)ను ఆమె భర్త, అత్త కట్నం కోసం వేధిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. 2022లో అఖిలను ప్రొద్దుటూరు మండలం ఉప్పరపల్లెకు చెందిన సుధీర్‌కుమార్‌కు ఇచ్చి వివాహం జరిపించారు. వారికి ఒక కూమార్తె ఉంది. పెళ్లి అయిన మూడు నెలల నుంచి సుధీర్‌కుమార్, ఆయన తల్లి జయమ్మ అదనపు కట్నం కోసం వేధిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉప్పరపల్లెలోని అత్తగారి ఇంటి నుంచి ఆమెను వెళ్లగొట్టారు. ప్రస్తుతం అఖిల పల్లవోలు గ్రామంలోని అమ్మగారి ఇంటిలో ఉంది. అఖిల ఫిర్యాదు మేరకు వారిద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆయిల్ ట్యాంకర్‌ను బలవంతంగా తీసుకెళ్లారు

దువ్వూరు, జనవ రి 22 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు నుంచి హైదరాబాద్ వైపు వెళుతున్న తన ఆయిల్ ట్యాంకర్‌ను బలవంతంగా తీసుకెళ్లారని చాపాడు మండలం నరహరిపురం గ్రామానికి చెందిన రామాంజినేయులరెడ్డి దువ్వూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ప్రొద్దుటూరులో ఆయిల్ వ్యాపారం చేస్తున్న రామాంజినేయులరెడ్డి తన ఆయిల్ ట్యాంకర్ ప్రొద్దుటూరు నుంచి హైదరాబాద్‌కు వెళుతుండగా దువ్వూరు సమీపంలో మధుసూదన్‌రెడ్డి, చల్లా ఆది రాజారెడ్డి మరి కొంత మంది కారులో వచ్చి అడ్డగించారు. మీ యజమాని మాకు డబ్బులు ఇవ్వాలంటూ డ్రైవర్‌ను కిందకు దింపి బలవంతంగా ట్యాంకర్‌ను తీసకెళ్లారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య

ఎర్రగుంట్ల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఎర్రగుంట్ల రైల్వేస్టేషన్‌లో అనంతపురం జిల్లా యాడికి గ్రామానికి చెందిన ఆంజనేయులు(35) గుర్తుతెలియని రైలుకింద పడి మృతిచెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. బేల్దారి పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్న మృతుడు తాగుడుకు అలవాటు పడి ఇంటికి రాకుండా తిరుగుతున్నట్లు పేర్కొన్నారు. అయితే భార్యా పిల్లలతో తరచూ ఫోన్‌లో మాట్లాడుతున్నట్లు, ఆయనకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నట్లు తెలిపారు. కేసు నమోదుచేసుకుని మృతదేహాన్ని ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

సీఎం హామీలు అమలు

- పారిశుధ్య కార్మికులకు రూ.లక్ష నగదు బహుమతి అందజేసిన కలెక్టర్ చెరుకూరి శ్రీధర్


కలెక్టర్, జేసీ చేతుల మీదుగా చెక్కును అందుకుంటున్న అమ్ములమ్మ, చెన్నమ్మ, గంగాధర్

కడప కలెక్టరేట్/మైదుకూరు రూరల్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మైదుకూరు పర్యట నలో భాగంగా ఇచ్చిన హామీలు అమలవుతు న్నాయి. పారిశుధ్య కార్మికుల కృషిని గౌర విస్తూ ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు ముగ్గురు పారిశుధ్య కార్మికులకు ఒక్కొక్కరికి లక్ష రూపాయిల నగదు బహుమతిని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి తన చాంబరులో బుధవారం అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ మైదుకూరు పారిశుధ్య కార్మికులు పి.అమ్ములమ్మ, జి.చెన్నమ్మ, యం.యుగంధర్ విలు వలు పాటిస్తూ విధుల పట్ల అంకిత భావంతో సమాజ శ్రేయస్సుకు ఎంతో విలువైన సేవలందిస్తున్నారు. రోజూ ఉదయం 5-30 గంటలకే విధులకు హాజరై మైదుకూరు రోడ్లు, టౌన్, పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుతున్నారన్నారు వీరి కృషి, పట్టుదలను గుర్తించిన ముఖ్యమంత్రి ఈనెల 18న మైదుకూరు సభలో ఒక్కొక్కరికి లక్ష రూపా యిల చొప్పున ముగ్గురికి మూడు లక్షల నగదు బహుమతిని ప్రకటించారన్నారు. సీఎం ఇచ్చిన హామీని అమలు చేస్తూ కలెక్టర్ ముగ్గురు పారిశుధ్య కార్మికులకు రూ.3 లక్షల నగదును చెక్కు రూపంలో అందించారు. తమ సేవలను గుర్తించి నగదు బహుమతి ప్రకటన చేసిన ముఖ్యమంత్రికి పారిశుధ్య కార్మికులు కృతజ్ఞతలు తెలిపారు. జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, మైదుకూరు మున్సిపల్ కమిషనరు శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాటల పోటీల్లో అంధ విద్యార్థినికి ప్రథమ బహుమతి


బహుమతి అందుకుంటున్న నజియా తుబుసం

కడప ఎడ్యుకేషన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కడప నగరం స్కౌట్ హాల్లో గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. ఈపోటీల్లో కడప నగరం శంకరాపురం ప్రభుత్వ అంధుల పాఠశాల విద్యార్థిని నజియా తుబుసం దేశభక్తి పాటల పోటీల్లో జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి సాధించింది. ఈ విద్యార్థినికి కడప ఉప విద్యాధికారి రాజ గోపాల్‌రెడ్డి బహుమతి అందజేశారు. స్కౌట్ జిల్లా కార్యదర్శి ప్రమీల ప్రభుత్వ అంధుల పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎబినేజర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉత్తర్వు 117కు ప్రత్యామ్నాయాలు

కడప ఎడ్యుకేషన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉత్తర్వు 117కు ప్రత్యామ్నాయాలను వివరిస్తూ ప్రత్యేక డాక్యుమెంట్‌ను రాష్ట్ర విద్యాశాఖ అధికారులకు సంఘం తరఫున సమర్పించినట్లు ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర అధ్యక్షుడు సీవీ ప్రసాద్, జిల్లాశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈశ్వరచంద్ర, అలీఖాన్ తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరం నుంచి తెలుగు, ఆంగ్ల మాధ్యమాలను అన్ని పాఠశాలల్లో ప్రవేశపెట్టాలి.. ఆ తర్వాత జీఓ 117ను రద్దు పరచాలి.. కొత్త నిబంధనల ప్రకారం స్టాఫ్ ప్యాటర్న్ లెక్కించాలని తదితర విషయాలపై వివరించినట్లు తెలిపారు.

26న రాష్ట్ర స్థాయి క్విజ్, వ్యాసరచన పోటీలు

గొల్లపూడి, జనవరి 21 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడిలోని ఎస్‌పీఎస్‌ఆర్‌సీ ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈనెల 26న 6వ తరగతి నుంచి టెన్త్ విద్యార్థులకు వడ్లమూడి బ్రదర్స్ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మేథ 2025 పేరుతో క్విజ్, వ్యాసరచన, కథల పోటీలు నిర్వహించనున్నట్లు ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ వడ్లమూడి రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు. ఒక పాఠశాల నుంచి ముగ్గురితో కలిసి ఉన్న ఒక టీమ్ మాత్రమే పోటీల్లో పాల్గొనాలన్నారు. ఈ నెల 24 సాయంత్రం 5 గంటల లోపు ఆయా పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు విద్యార్థుల పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 9490336550ను సంప్రదించాలన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు


ఎరువుల బస్తాల స్టాకును పరిశీలిస్తున్న ఏడీఏ సురేష్‌రెడ్డి, ఏవో శివశంకర్‌రెడ్డి

ప్రొద్దుటూరు రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఎరువుల దుకాణాల యజమానులు వ్యవసాయ శాఖ నియమ నిబంధనలను అనుసరించి వ్యాపారలావాదేవీలు కొనసాగించాలని, లేనిపక్షంలో లైసెన్సు రద్దు చేస్తామని వ్యవసాయ శాఖ అధికారులు హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని మైదుకూరు రోడ్డులో ఉన్న మహాలక్ష్మి, కేవీఎస్ఆర్ ఎరువుల దుకాణాల్లో వ్యవసాయ శాఖ ఏడీఏ పి.సురేష్‌రెడ్డి, ఏవో ఎస్.శివశంకర్‌రెడ్డితో కలిసి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా దుకాణాల్లోని రికార్డులను, బిల్లుబుక్కులను, స్టాకు వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ అమ్మిన ప్రతి బస్తాకు నగదు బిల్లు రైతులకు ఇవ్వాలని తెలిపారు. ఎరువుల బస్తాల్లో, తూకాల్లో ఏవైనా అవకతవకలు ఉంటే చర్యలు తప్పవని డీలర్లను హెచ్చరించారు. ప్రతి డీలరు లైసెన్సు కలిగి ఉండి గోడౌన్ అనుమతి ఉండాలని ఎరువుల ధరను రైతులకు కనిపించేలా నోటీసు బోర్డులో రాసి పెట్టాలని సూచించారు.

పైలెట్ ప్రాజెక్టు గ్రామాన్ని సందర్శించిన జేసీ


ఇడమడకలో రీ సర్వే గురించి ఆరా తీస్తున్న జేసీ

దువ్వూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలంలో బుధవారం జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ పర్యటించారు. మొదట మండల తహసీల్దారు కార్యాలయానికి వెళ్లి ప్రజలు ఇచ్చిన అర్జీల పరిష్కారంపై తహసీల్దారు ద్వారా ఆరా తీసి.. కొన్ని సూచనలు చేశారు. అనంతరం పైలెట్ ప్రాజెక్టు గ్రామంగా ఎంపికైన ఇడమడకకు ఆర్డీవో సాయిశ్రీతోపాటు స్థానిక అధికారులతో కలిసి వెళ్లారు. అక్కడ భూ సంబంధ సమస్యలు గురించి అడిగి తెలుసుకున్నారు. రీ సర్వేకు సంబంధించి కొన్ని సూచనలు ఇచ్చారు. తహసీల్దారు అక్బల్‌బాష, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్ చొరవతో..... కడపకు చేరుకున్న మృతదేహం


కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న శ్రీనివాసరెడ్డి

కడప క్రైం, జనవరి 22. (ఆంధ్రజ్యోతి) : కడపకు చెందిన షేక్ మహ్మద్ అనీస్ అన్సారీ జీవనోపాధి కోసం మస్కట్ వెళ్లి అక్కడ గుండెపోటు రావడంతో మృతి చెందారు. వారి కుటుంబ సభ్యులు సోషల్ మీడియా ద్వారా మంత్రి లోకేశ్‌కు సమాచారం ఇవ్వడంతో ఆయన స్పందించారు. మంత్రి చొరవతో మృతదేహాన్ని కడపకు రప్పించారు. దీంతో కుటుంబసభ్యులు మంత్రికి కృతజ్ఞతలు తెలియపరిచారు. మృతదేహానికి బుధవారం అంత్యక్రియలు జరిపారు. విషయం తెలుసుకున్న జిల్లా టీడీపి అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి వాసు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని సందర్శించి కుటుంబసభ్యులను పరామర్శించారు.

'నిబంధనల మేరకే ములాఖత్‌లు'

కడప క్రైం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కడప సెంట్రల్ జైలులో శిక్ష అనుభ విస్తున్న, రిమాండ్ ఖైదీలకు నిబంధనల మేరకే ములాఖత్‌లు అవకాశం ఇస్తున్న ట్లు డిప్యూటీ సూపరింటెండెంట్ కమలాకర్ బుధవారకం ఒక ప్రకనటలో వివరించారు. ఖైదీలకు అల్పాహార సౌలభ్యం కూడా నిబంధనల ప్రకారం ఇస్తామన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఖైదీలకు వసతి కల్పిస్తామని తెలిపారు.

స్కూటరు - లారీ ఢీ.. ఇరువురు దుర్మరణం



కడప క్రైం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కడప నగరం సెంట్రల్ జైలు వద్ద బుధవారం రాత్రి స్కూటరును లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇరువురు దుర్మరణం చెందారు. పోలీసుల వివరాల మేరకు.. కడప నగరం రామాంజ నేయపురంలోని శ్రీరామ్‌నగర్‌కు చెందిన పడిగ ప్రవీణ్ (27) అతని బంధువు వి.సుభాష్ (23) పని నిమిత్తం ద్విచక్ర వాహనంలో టౌనుకు వెళ్లి తిరిగి వస్తుండగా కడప సెంట్రల్ జైలు వద్దకు రాగానే తిరుపతి నుంచి కర్నూలు వైపు వెళుతున్న ఓ లారీ వేగంగా వచ్చి స్కూటరును ఢీకొంది. ఈ ప్రమా దంలో ఇరువురు మృతి చెందారు. విషయం తెలుసుకున్న రిమ్స్ పోలీసులు సంఘ టనాస్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను మార్చు రీకి తరలించారు. ఈమేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

కుక్కల దాడిలో 30 గొర్రెలు మృతి


కుక్కల దాడిలో మృతిచెందిన గొర్రెలు

దువ్వూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు జిల్లా పరిషత్ హైస్కూలు సమీప వీధిలో మంగళవారం అర్ధరాత్రి గొర్రెలపై కుక్కలు దాడి చేయడంతో 30 గొర్రెలు మృతి చెందాయి. గొర్రెల యజమాని టి.ఓబులేసు లబోదిమంటూ విలపిస్తున్నారు. బాధితుడి వివరాల మేరకు... చలికాలం కావడంతో టి.ఓబులేసు కుటుంబీకులతో కలసి ఇంటిలో నిద్రిస్తున్నారు. ఆరుబయట పాకలో గొర్రెలు ఉన్నాయి. కుక్కలు గుంపులుగా వచ్చి పాకలోని మూగజీవాలపై దాడి చేసి ఇష్టమొచ్చినట్లు వాటిని కొరికి చంపాయి. శబ్ధాలు వినిపించడంతో గొర్రెల యజమాని నిద్రలేచి వచ్చి చూశాడు. సంఘటన గమనించి కేకలు వేవేయగా.. కుక్కలు పారిపోయాయి. అయితే అప్పటికే 30 గొర్రెలను కొరికి చంపేశాయి. మరో 10 గొర్రెలు ప్రాణాపాయం నుంచి బయటపడ్డాయి. బుధవారం ఉదయం పశువైద్యశాఖ అధికారులు వచ్చి పరిశీ లించి... గాయపడిన గొర్రెలకు చికిత్స చేశారు. గొర్రె ల మృతితో రూ.4లక్షలు నష్టం వాటిల్లిందని.. ప్రభు త్వం ఆదుకోవాలని బాధితుడు ఓబులేసు కోరుతు న్నాడు. కాగా, గ్రామ పంచాయతీ కుక్కల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎవరో ఈ ప్రాంతంలో కొత్త కుక్కలు వదిలి వెళ్లారని, అవి దాడులకు పాల్పడుతున్నాయని వాపోతున్నారు. గ్రామ పంచాయతీ అధికారులు కుక్కల బెడద సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

మండి కింగ్ అరేబియన్ రెస్టారెంట్ ప్రారంభం



శ్రీనివాసరెడ్డిని సన్మానిస్తున్న రెస్టారెంటు నిర్వాహకులు

కడప క్రైం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కడప నగరం చెన్నూరు బస్టాండు ఎస్‌టీవీ పైన కొత్తగా ఏర్పాటు చేసిన మండి కింగ్ అరేబియన్ రెస్టారెంట్‌ను టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి బుధవారం ఘనంగా ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ హైదరాబాదులో ప్రముఖ మండి కింగ్ అరేబియన్ రెస్టారెంట్ అనేక బ్రాంచ్‌లు కలిగి ఉన్నదని, ఇప్పుడు మన కడపలో ప్రారంభించడం ఆనందదాయకమన్నారు. రెస్టారెంట్ల ఓనర్లను ఆయన అభినందించారు. మండి కింగ్ అరేబియన్‌రెస్టారెంట్ అధినేత ఇర్ఫాన్ మాట్లాడుతూ ఆహ్లాదకర వాతావరణంలో నాన్‌వెజ్ రుచులకు తమ రెస్టారెంటు ప్రత్యేకమన్నారు. తమ హోటల్‌లో జ్యూస్‌బార్ ప్రత్యేక అలంకరణ అని తెలిపారు. అందరికీ అందుబాటులో రుచికరమైన నాన్‌వెజ్ వంటలు కలవని తెలిపారు. రెస్టారెంటు నిర్వాహకులు షేక్ నిజాం, కడప నగర టీడీపీ యువనేత పి.మన్సూర్ అలీఖాన్, నాయబ్, జావీదుబాషా, షఫి, తౌసిఫ్, అమీన్, రవి, శివ పాల్గొన్నారు.

సర్వజన ఆస్పత్రిలో వెల్‌నెస్ క్లినిక్ ప్రారంభం



క్లినిక్‌ను ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్, ప్రిన్సిపాల్

కడప సెవెన్ రోడ్స్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కడప ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో బుధవారం డీఎంఈ, ఏపీ ఆదేశాల మేరకు వెల్‌నెస్ క్లినిక్ ప్రారంభించారు. జీవనశైలి మార్పులతో వస్తున్న వివిధ రకాల వ్యాధులు ఉదాహరణకి బీపీ, షుగర్, గుండెజబ్బులు, కిడ్నీ వంటి జబ్బులు చిన్నవయసులోనే వస్తాయన్నారు. ఇలాంటి వాటిని ముందుగానే గుర్తించి నివారించడానికి ఇక్కడ ప్రత్యేక ఓపీ నిర్వహిస్తున్నామన్నారు. సోమవారం, బుధవారం ఓపీ నెంబర్ 222లో అందుబాటులో ఉంటారన్నారు. ఈ ఓపీని కమ్యూనిటీ మెడిసిన్ డిపార్ట్‌మెంట్ వైద్యులు, డైటీషియన్స్, నర్సింగ్ సిబ్బంది నిర్వహిస్తారు. వెల్‌నెస్ క్లినిక్‌ని ప్రజలు సద్వినియోగం చేసుకుని చిన్న వయసులోనే జాగ్రత్త పడాలని సూచించారు. ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జీవీ రమణాదేవి, ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.సురేఖ, ఎస్‌పీఎం డిపార్ట్‌మెంట్ హెచ్ఓడీ డాక్టర్ గోపీకృష్ణ, సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ వై.శ్రీనివాసులు, డాక్టర్ రాజేశ్వరి, ఎస్.పీ.ఎం విభాగంలోని వైద్యులు, సిబ్బంది, నర్సింగ్ సూపరింటెండెంట్, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉప్పరపల్లెలో విద్యుత్ దీపాలు ఏర్పాటు

చెన్నూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఉప్పరపల్లెలో విద్యుత్‌దీపాలు ఏర్పాటు చేశారు. గతంలో 360కి పైగా విద్యుద్దీపాలు ఉండగా వాటిలో సగానికి పైగా ఇటీవల కాలిపోవడం, లూజు కనెక్షన్లు తదితర సమస్యలతో వెలగకపోవడంతో సర్పంచ్ శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో వాటిని సరిచేశారు.

పశువుల ఆరోగ్యంతోనే రైతుల అభివృద్ధి

చెన్నూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పాడి పశువులు, పొట్టేళ్లు, గొర్రెలు, మేకలు పెంచుకుని ప్రతి రైతు వాటి ఆరోగ్యం కాపాడుకోవాలన్నారు. తద్వారా వాటితో ఆదాయం యజమానుల ఆర్థికంగా అభివృద్ధి చెందగలరని రామనపల్లె పశువైద్యాధికారి డాక్టర్ ఎర్రపురెడ్డి అన్నారు. బుధవారం నిర్వహించిన పశు ఆరోగ్య శిబిరాన్ని స్థానిక సర్పంచ్ తుమ్మల శ్రీలక్ష్మి, త్రిలోకనాధరెడ్డి ప్రారంభించారు. 3వేల గొర్రెలకు నట్టల నివారణ మందు, 40 పాడి పశువులకు ఆరోగ్య పరీక్షలు, పలు పశువులకు ఏలిక పాముల నివారణ లాంటి పరీక్షలు చేసి మందులు అందించారు. సీజనల్ వ్యాధులు, వాతావరణ మార్పులతో వచ్చే వ్యాధులు వంటి వాటి గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో ఖాజీపేట పశువైద్యాధికారి డాక్టర్ మురళి, పశువైద్యులు విద్యాసాగర్, హరిత, జీవన్‌తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

ప్రతిరైతు ఈ-కేవైసీ చేయించుకోవాలి

వేముల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు ఈ-కేవైసీ చేయించుకోవాలని ఏడీఏ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ అధికారి చెన్నారెడ్డితో కలిసి వ్యవసాయ అసిస్టెంట్లతో సమీక్షించారు. ఏడీఏ మాట్లాడుతూ రబీ సీజన్‌లో 3524 మంది రైతులు 10815 ఎకరాల్లో పంట నమోదు చేయించుకున్నారు. 3524 మంది రైతుల్లో 2087 మంది రైతుల ఇ-కేవైసీ పూర్తిఅయినట్లు తెలిపారు.

రక్షణ లేని సెల్ టవర్

భయాందోళన చెందుతున్న సమీప పొలాల రైతులు



ఫెన్సింగ్ లేని చిన్నమాచుపల్లె సమీప టవరు

చెన్నూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో చిన్నమాచుపల్లె పొలాల్లో ఏర్పాటు చేసిన ఎయిర్‌టెల్ టవర్‌కు ఫెన్సింగ్ లేకపోవడంతో ఆ ప్రాంతీయులు తీవ్ర భయాదోళన చెందుతున్నారు. పైగా ఈ టవర్ పొలాల్లో ఉండడం, రోజు ఆప్రాంతాలకు పశువులు, వాటిని మేపేవారు వెళుతుండడంతో విద్యుత్ ప్రమాదాలకు గురవుతారేమోననే భయాందోళన చెందుతున్నారు. అదే ప్రాంతంలో ఉన్న బీఎస్ఎన్ఎల్ టవర్ నిర్వహకులు జాగ్రత్తలు పాటిస్తున్నా ఎయిర్‌టెల్ టవర్ నిర్వహకులు పట్టించుకోవడం మానేశారనే ఆరోపణలున్నాయి. పైగా ఈ టవరు పక్కనే విద్యుత్ తీగలు ఉన్న బోర్డులు సరిగా మూతలు లేక కనిపిస్తుండడంతో ఇవి ప్రమాదానికి సంకేతమని చీకటి పడితే ఆప్రాంతంలో రైతులు ఎవరూ వెళ్లకుండా పొలాల్లో అలాగే వదిలి తెల్లవారగానే వెళుతుంటారని అంటున్నారు. సంబంధిత టవరు సిబ్బంది స్పందించి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని లేదంటే ప్రజలు ఆందోళనకు దిగుతామని చెబుతున్నారు.

పట్టించుకుంటే కదా

ఎయిర్‌టెల్ టవర్ పడిపోతుందని చాలా కిందటే నిర్వాహకులకు చెప్పాం. అయినా పట్టించుకుంటే కదా. వ్యవసాయ పొలాల్లోకి ఎలా వెళ్లాలి, పాడిపశువులను ఎలా మేపుకోవాలి. వాటిని జాగ్రత్తగా చూసుకుంటూ ఉంటున్నాం. ఏ మాత్రం ఏమరుపాటుగా టవర్‌లోకి వెళ్లినా ఫెన్సింగ్ లేక కరెంటు బోర్డులకు మూతలు లేక వాటిని పశువులు తాకితే వాటి యజమానులు లక్షలాది రూపాయలు నష్టపోవాల్సి వస్తుంది. ఇప్పటికైనా టవరు యాజమాన్యం స్పందించాలి. లేదంటే ప్రజలంతా ఆందోళనకు దిగక తప్పదు.

– పాలకొండయ్య, చిన్నమాచుపల్లె, చెన్నూరు మండలం





టవర్ వద్దకు వెళ్లే దారికి అధ్వాన్నంగా ఉన్న గేటు - కరెంటు బోర్డుకు మూత లేని దృశ్యం

వరిలో కాలిబాటలు ఏర్పాటు చేసుకోవాలి



వరిపంటను పరిశీలిస్తున్న వ్యవసాయసిబ్బంది

కమలాపురం రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): వరినాట్లు వేసే సమయంలో పొలంలో కాలిబాటలు ఏర్పాటు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి సరస్వతి సూచించారు. బుధవారం కమలాపురంలో నిర్వహించిన పొలం పిలుస్తోందిలో భాగంగా వరి పంటలను పరిశీలించిన ఆమె మాట్లాడుతూ వరి నాటేటప్పుడు ప్రతి రెండు మీటర్లకు 30 సెంటీమీటర్లు కాలిబాటలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. గట్లపైన పెరిఫెరల్ ప్లాంటేషన్ బంతి, కంది, మొక్కజొన్న, సస్బేనియా వంటివి నాటుకోవాలని తెలిపారు. కాండం తొలిచే పురుగు, ఆకు ముడత పురుగుల నివారణకు ఎకరానికి 8 లింగాకర్షక బుట్టలు, 10 నుంచి 15 పక్షిస్థావరాలు పెట్టుకోవాలని తెలిపారు. నత్రజని ఎరువులను అధిక మొతాదులో వాడకూడదని తెలిపారు. వరి నారు కొసలు తుంచి నాటడం వల్ల బ్రౌన్ తొలిచే పురుగుగుడ్లను పెట్టకుండా నివారించవచ్చని తెలిపారు. వాతావరణంలో వచ్చే విపరీత మార్పులను అధిగమించాలంటే ప్రకృతి వ్యవసాయమే శరణ్యమని సూచించారు. సుస్థిర వ్యవసాయానికి ఇతర ప్రత్యామ్నాయ మార్గాలు లేని కారణంగా ప్రకృతి వ్యవసాయం వెనుక ఉన్న శాస్త్రీయతను అందరూ గుర్తించాలని సూచించారు. మొక్కల పెరుగుదలకు ఉపయోగపడే ద్రావణాలైన పంచగవ్య ఎకరాకు నాలుగు లీటర్లు పిలకలు పెట్టే దశలో ఒకసారి పిచికారీ చేయాలన్నారు. సాధ్యమైనంత వరకు లేత వయసు ఉన్న నారును అనగా 25 రోజుల నుంచి 30 రోజుల్లోపు నారును నాటుకోవాలని తెలిపారు. కలుపు నివారణకు విత్తిన లేదా నాటిన 8 నుంచి 10 రోజులకు పైరజో సల్ఫ్యూరాన్ ఎకరాకు 100 గ్రాములు చొప్పున 200 లీటర్లు కలిపి పొలంలో పిచికారీ చేయాలన్నారు. విత్తిన లేదా నాటిన 15నుంచి 20 రోజులకు ఎకరాకు బిస్ పైరిబాక్ సోడియం 10శాతం ఎస్‌సీ 100 మి.లీ లేదా ట్రయఫోమెన్ 20 శాతం ప్లస్ ఇతాక్సి సల్ఫ్యూరాన్ 10శాతం డబ్ల్యుజీ 60 గ్రాములు, 250 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయడం ద్వారా గడ్డి, వెడల్పాకు కలుపు మొక్కలను సమర్థవంతంగా నివారించవచ్చన్నారు. కాండం తొలుచు పురుగు ఆకుముడత పురుగు నివారణకు లీటరు నీటికి కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 2 గ్రాములు లేదా క్లోరాంత్ర నిలిప్రోల్ 0.3 ఎంఎల్ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. చిరుపొట్టదశలో ఎకరాకు కార్టప్ హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలు 8 కార్బోఫురాన్ 3జీ గుళికలు 10 కిలోలు లేదా క్లోరాంత్ర నిలిప్రోలు 0.4 జీ నాలుగు కిలోలు వేసుకోవాలని తెలిపారు. వ్యవసాయ సహాయకురాలు ఇందిరాదేవి పాల్గొన్నారు.

ఇసుకపల్లిలో...

వల్లూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఇసుకపల్లెలో నిర్వహించిన పొలం పిలుస్తోందిలో కమలాపురం వ్యవసాయ సహాయ సంచాలకులు నరసింహారెడ్డి క్షేత్రస్థాయిలో వరి పంటను పరి శీలించి రైతులకు తగు సూచనలు సలహాలు ఇచ్చారు. వరిలో ఆకుముడత, కాండం తొలుచు పురుగు ఆశిస్తే అసిఫోట్ 1.5 గ్రాములు లేదా కార్‌టాప్ హైడ్రోక్లోరైడ్ 2 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. వరి పంట వేయదలచిన వారు దుక్కిలో ఎకరాకు 20 కిలోల జింక్ సల్ఫేట్ మూడు పంటలకు ఒకసారి కచ్చితంగా వేసుకోవాలని తెలిపారు. వరి నాటిన పొలంలో జింక్ ధాతు లోపం గుర్తిస్తే చిలేటెడ్ జింక్ 1 గ్రాము, యూరియా 5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. 19. 19. 19 - 10 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసిన పంట పెరుగుదల బాగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సాయిజ్యోతి, గ్రామ వ్యవసాయ సహాయకురాలు సురేఖ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయాలి : సీపీఐ

కడప సెవెన్‌రోడ్స్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలకు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇంటి స్థలం, ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు, రెండెరాల సాగు భూమి సాధన కోసం జనవరి 27న జరిగే చలో కలెక్టరేట్ జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర పిలుపునిచ్చారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూములను పరిరక్షించి అర్హులైన పేదలకు ఇంటి స్థలాలు సాగు భూమి పంచాలని సీపీఐ చేపట్టిన దశలవారీ పోరాటంలో భాగంగా ఇది వరకే గ్రామ, వార్డు సచివాలయాల వద్ద రెండో దశ తహసీల్దార్ కార్యాలయాల వద్ద మూడో దశ పోరాటంలో భాగంగా కలెక్టర్ కార్యాలయాల వద్ద ఆందోళన జరగనుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి వెంకట్ శివ, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

హిట్ అండ్ రన్ కేసుల పరిష్కారానికి చర్యలు

● సీనియర్ సివిల్ జడ్జి బాబాఫక్రుద్దీన్

కడప రూరల్, జనవరి 22(ఆంధ్రజ్యోతి): హిట్ అండ్ రన్ కేసుల పరిష్కారానికకి తగు చర్యలు చేపట్టాలని డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి బాబాఫక్రుద్దీన్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవాసదన్‌లో హిట్ అండ్ రన్ కేసులపై జిల్లా స్థాయి అధికారుల మానిటరింగ్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ హిట్ అండ్ రన్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టిని సారించాలన్నారు. పరిహార చెల్లింపులను చేపట్టాలన్నారు. కార్యక్రమంలో రాజంపేట ఆడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ మనోజ్ హేగ్డే, డీటీసీ డీఎస్పీ కరీం, కడప రెవెన్యూ డివిజనల్ అధికారి తదితరులు పాల్గొన్నారు.

హైవేను పరిశీలించిన ఆర్డీఓ

చక్రాయపేట, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రాయచోటి-వేంపల్లె హైవే పనులను ఆర్డీఓ చిన్నయ్య పరిశీలించారు. కొన్నేళ్లుగా పనులు నిలిచిపోయి రాకపోకలకు ఇబ్బంది ఉండేది. ఇటీవల పనులు చేపట్టడంతో చక్రాయపేట 4.20ఎకరాలు రోడ్డుకు పోయిందని, సురభి, పాయలోపల్లె సమీపాన ల్యాండ్‌ను గుర్తించి పరిహారంపై మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయకుమారి, సర్వేయర్ శివారెడ్డి, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఉర్దూను తెలుగు పాఠశాలల్లో కలపొద్దు

కడప సెవెన్ రోడ్స్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలో పునర్నిర్మాణంలో భాగంగా రాష్ట్రంలోని ఉర్దూ పాఠశాలలు, సెక్షన్ తరగతులను తెలుగు, ఆంగ్ల మాధ్యమ పాఠశాలల్లో కలపొద్దని రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉర్దూ ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని ఆప్‌కి ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి షేక్ మక్బూల్ బాషా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల కొన్ని జిల్లాల్లో ఎంఈఓలు మోడల్ స్కూల్స్ ఫార్మేషన్‌లో భాగంగా తెలుగు మీడియం పాథమిక పాఠశాలల, ఉర్దూ పాఠశాలలను కూడా మెర్జ్ చేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉర్దూ ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని కోరారు.

12వ పీఆర్సీని అమలు చేయాలి

కడప ఎడ్యుకేషన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయులకు 12వ పీఆర్సీని అమలు చేయాలని యూటీఎఫ్ జిల్లా శాఖ డిమాండ్ చేసింది. బుధవారం యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడును కలిసి 12వ పీఆర్సీని తక్షణం అమలు చేయాలని, ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలను చెల్లించాలని కోరుతూ యూటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్‌బాబు, జిల్లా సహాధ్యక్షులు వై.రవికుమార్, డి.సుజాతా రాణి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికవడం హర్షణీయం

కడప స్పోర్ట్స్, జనవరి 22, (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో 25నుంచి 27వరకూ జరగనున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో జిల్లా జట్టుకు ఎంపికవడం హర్షణీయమని కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి అన్నారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో కబడ్డీ సీనియర్ ఎంపికలు నిర్వహించారు. బాలుర విభాగంలో దినేష్‌చౌదరి, శివాజీ, వంశీధర్‌రెడ్డి, అరవింద్, సుదర్శన్, రెడ్డయ్య, మౌలేశ్వర్‌రెడ్డి, బాలసుబ్రహ్మణ్యసాయి, శ్రీధర్‌రెడ్డి, విష్ణు, వెంకటసుభాష్, స్టాండ్‌బైగా..సిద్దిక్, ప్రవీణ్‌కుమార్, అశోక్, వర్ధన్, బాలికల విభాగంలో షాహినా, నాగశృతి, చైతన్య, మానస, పద్మశ్రీ, గౌరీ, నాగవేణి, శివకవిత, శ్రావణి, మల్లేశ్వరి, పల్లవి, చెన్నమ్మ, స్టాండ్‌బైగా మేఘన, వైష్ణవి ఉన్నారు.

నేటి నుంచి మొబైల్ ఆధార్ నమోదు ప్రక్రియ ప్రారంభం

చెన్నూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా ఆరేళ్లలోపు ఉన్న చిన్నారులందరికీ గురువారం 21వతేదీ నుంచి అన్ని పాఠశాలల విద్యార్థులకు ఆధార్ నమోదు ప్రక్రియ ప్రారంభిస్తున్నట్లు ఎంపీడీఓ కిరణ్ మోహన్‌రావు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు ఆరేళ్లలోపు వయసు ఉండి ఆధార్ నమోదు చేయించుకోని ప్రతి చిన్నారి వార్డు సచివాలయ పరిధిలో నమోదు చేయించుకోవాలన్నారు. అంగన్వాడీల్లోని చిన్నారులు సైతం ఈ ఆధార్ నమోదు చేయించుకునేందుకు ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. 21న చెన్నూరు 1, 22న చెన్నూరు-2, 23న చెన్నూరు 3, 24న బాలుర ఉన్నత పాఠశాల చెన్నూరు, కొండపేట 3వ వార్డు అంగన్వాడీ సెంటరులో నమోదు ప్రక్రియ ఉంటుందన్నారు. 27న ఉప్పరపల్లె 4వవార్డు అంగన్వాడీ సెంటరు, 28న గుర్రంపాడు అంగన్వాడీ కేంద్రం, 29న బలసింగాయపల్లె, 30న శివాలపల్లె, 31న రామనపల్లె అంగన్వాడీ కేంద్రాల్లో ఆధార్ నమోదు ప్రక్రియ ఉంటుందన్నారు. డిజిటల్ అసిస్టెంటు సాయిప్రవీణ ఈ ఆధార్ నమోదు చేయిస్తుందని తమ పిల్లలకు మొబైల్ ఆధారు చేయించని తల్లిదండ్రులు ఈ అవకాశం సద్వి నియోగం చేసుకోవాలన్నారు.

వెంకటాపురంలో పశువైద్యశిబిరం

కమలాపురం రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పెద్దచెప్పలి పశువైద్యశాల పరిధిలోని పి.వెంకటాపురం గ్రామం, పొడదుర్తి పంచాయతీలో పశువైద్యశిబిరం నిర్వహించామని, డాక్టర్ శివజ్యోతి తెలిపారు. ఈ శిబిరానికి విశేష స్పందన లభించిందన్నారు. ఈ శిబిరంలో 109సాధారణ చికిత్సలు, 23 గర్భ సంబంధిత, 17 చూడి నిర్ధారణ పరీక్షలు, 47 లేగదూడలకు ఏలికపాముల మందులు, 187 జీవాలకు నట్టల నివారణ మందులు తాపామన్నారు. కార్యక్రమంలో రుక్సానా(ఎస్ఏ), సచివాలయ ఏహెచ్ఏలు కీర్తన, దుర్గాప్రసాద్, సుధాకర్, గోపాలమిత్ర, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

రేపు ప్రత్యేక విద్యుత్ అదాలత్

కడప ఎర్రముక్కపల్లె, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కడప నగరం శంకారపురం పవర్‌హౌస్ ప్రాంగణలో 24వ తేదీ ఉదయం 10 నుంచి 1.30గంటల వరకు ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఏపీఎస్పీడీసీఎల్ కడప డివిజన్ కార్యనిర్వాహక ఇంజనీర్ హరిసేవ్యానాయక్ తెలిపారు. విశ్రాంత న్యాయమూర్తి వి.శ్రీనివాస ఆంజనేయమూర్తి ఛైర్‌పర్సన్, కె.రామ్మోహన్‌రావు ఆర్థిక సభ్యులు, ఎస్ఎల్ అంజనికుమార్, సాంకేతిక సభ్యులు హాజరవుతారన్నారు. కడప డివిజన్ పరిధిలోని వన్‌టౌన్, టుటౌన్, రూరల్, ఒంటిమిట్ట సబ్ డివిజన్ పరిధిలోని సెక్షన్ల మండలాలకు ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహిస్తామన్నారు. వినియోగదారులు సమస్యలను పరిష్కరించుకో వాల్సిందిగా కోరారు.

ఘనంగా వేమన జయంతి

కడప ఎడ్యుకేషన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): వైవీయూలో వేమన జయంతి మహోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. పరిపాలన భవనం నుంచి విశ్వవిద్యాలయం ప్రధాన ద్వారం వద్ద ఉన్న వేమన విగ్రహం వరకు వేమన తాత్విక చైతన్య యాత్ర నిర్వహించారు. ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.కృష్ణారెడ్డి, ప్రధానాచార్యులు ఎస్.రఘునాథరెడ్డి, బాధ్య కులసచివులు ఆచార్య పుత్తా పద్మ వేమన విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం అన్నమయ్య సెనెట్ హాల్లో నిర్వహించిన ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమంలో శ్రీవెంకటేశ్వర యూనివర్శిటీ విశ్రాంత ఆచార్యులు మేడిపల్లి రవికుమార్ మాట్లాడుతూ వేమన ప్రపంచం విస్తృతమైందన్నారు. వేమనను అధ్యయనం చేయడం అంటే జీవితాన్ని అనుసరించడమన్నారు. వేమనపై వీరశైవం ప్రభావం కనిపిస్తుందని, హేతువాదిగా కనిపిస్తారన్నారు. మూఢ విశ్వాసాలను తూర్పారబట్టిన విప్లవవాది వేమన అన్నారు. వేమన పద్యాలలో సాధారణమైనవి కాకుండా ఆలోచింప చేసేవి విద్యార్థుల సిలబస్‌లో ఉంచాలని ఆకాంక్షించారు. వేమన యోగి కాదని జీవితంలోని వాస్తవితను మన ముందుంచిన వారని విశ్లేషించారు. ఆచార్య కె.కృష్ణారెడ్డి, వివిధ విభాగాల డీన్‌లు, ఆచార్యులు, సహ, సహాయచారార్యులు, అకడమిక్ కన్సల్టెంట్లు, స్కాలర్లు, విద్యార్థులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల నుంచి ఇద్దరు అదృశ్యం

కడప క్రైం జనవరి 22. (ఆంధ్రజ్యోతి): రెండు వేర్వేరు ప్రాంతాల నుంచి ఓ మహిళ, ఓ వ్యక్తి అదృశ్యమయ్యారు. రిమ్స్ ఎస్ఐ జయరాములు వివరాల మేరకు కడప బుడ్డాయపల్లె వాసి నాగేటి నరసింహులు, ఐటీసీలో సేల్స్‌మేన్‌గా పనిచేస్తున్నారు. ఈనెల 19న ఇంటి నుంచి బయటకు వెళ్లి రాలేదన్నారు. రామకృష్ణనగర్ వాసి మోటుపల్లి ప్రమీల 20న ఇంటి నుంచి బయటకు వెళ్లి అదృశ్యమైనట్లు వెల్లడించారు.

ఆరోగ్యకర జీవితానికి చిట్కాలు

వేముల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): సంస్థాగత విజయానికి ఉద్యోగుల ఆరోగ్యం, ప్రాముఖ్యతను తెలియజేస్తూ 'ఆరోగ్యకరమైన జీవితానికి చిట్కాలు' అంశంపై సాంకేతిక ప్రసంగాన్ని నిర్వహించారు. అనంతపురం కిమ్స్ సవేరా సీనియర్ వైద్యాధికారి డాక్టర్ జి.దుర్గాప్రసాద్, ప్రఖ్యాత కన్సల్టెంట్ యురాలజిస్ట్, మూత్రపిండ మార్పిడి శస్త్రచికిత్స నిపుణుడు డాక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ సురక్షితమైన, ఆరోగ్యకరమైన జీవనశైలిని నిర్వహించడానికి అనేక కీలక అంశాలను ప్రస్తావించారు. వ్యాయామం యోగా, సమతులయ్య అలవాట్ల ప్రాముఖ్యతను నొక్కిచెప్పారు. విపిన్ కుమార్ శర్మ, డాక్టర్ హరిదీప్, డాక్టర్ దుర్గాప్రసాద్, చీఫ్ మేనేజర్ సోంజోయ్ ఛటర్జీ, సుమ్‌సర్కార్, జనరల్ మేనేజర్ (మిల్), కిషోర్ భగత్, డీజీఎం (మైన్)/హెచ్ఓడీ సహా సీనియర్ అధికారులు పాల్గొన్నారు. దుర్గాప్రసాద్‌ను యూసీఐఎల్ అధికారులు శాలువాతో సత్కరించారు. డాక్టర్ హిమబిందు, ప్రముఖులు పి.శ్రీహర్ష, అమ్జద్‌అలీ, విజయ్‌కుమార్, ఎల్.రాజేష్, జైసింహారెడ్డి, ఎన్వీరెడ్డి, గణేష్‌శంకర్, అభిజ్ఞాన్, సురేష్, చంద్రకళ పాల్గొన్నారు.

జిల్లా మహాసభల పోస్టర్ విడుదల

కడప ఎడ్యుకేషన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభల పోస్టర్లను ప్రకాష్ నగర్ ప్రభుత్వ ఎస్సీ హాస్టల్‌లో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరపోగు రవి విడుదల చేశారు. విద్యారంగ సమస్యలు పరిష్కారం కోసం భవిష్యత్తు పోరాటానికి శ్రీకారం చుట్టడం ప్రణాళిక సిద్ధం చేసి పోరాడాలని మహాసభ నిర్వహిస్తున్నామన్నారు. వీటితో పాటు విద్యార్థులు హాస్టల్లు సమస్యలపై చర్చిస్తామన్నారు. ఎస్ఎఫ్ఐ నగర అధ్యక్షుడు జాలా సుమంత్, ఉపాధ్యక్షులు వంశీ, వినోద్, నగర నేతలు మనోహర్, అభిలాష్, తిరుపాల్ పాల్గొన్నారు.

ఉగాది నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

గండికోట నిర్వాసితులను నట్టేట ముంచిన జగన్● గండికోట పరిహారం కోసం కసరత్తు ● బ్యాక్‌వాటర్‌లో చేపపిల్లలు వదిలిన ఎమ్మెల్యే ఆది

కొండాపురం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఉగాది నుంచి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, ఆదిశగా ప్రభుత్వం చర్యలు ప్రారంభించిందని ప్రభుత్వ విప్, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి తెలిపారు. ఆయన బుధవారం కొండాపురం పాత ఊరులోని పాత పోలీస్‌స్టేషన్ సమీపంలో గండికోట బ్యాక్‌వాటర్‌లో చేపపిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాలను అమలు కు వచ్చే బడ్జెట్‌లో ప్రభుత్వం పూర్తి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఎవరైనా పరిహారం ఇచ్చిన తర్వాత ప్రాజెక్టులో నీళ్లు నింపుతారని, కానీ గత ప్రభుత్వం లో జగన్ మాత్రం మీబిడ్డనని చెప్పుకుంటూ పూర్తి స్థాయిలో పరిహారం అందించకుండా గండికోట నిర్వాసితులను నట్టేట ముంచారని ఆయన మండి పడ్డారు.ఇప్పటికే మంత్రి నిమ్మలరామనాయుడు, కలెక్టర్ శ్రీధర్‌తోతో కలిసి పరిహారం విషయమై కసరత్తు చేస్తున్నామని వచ్చే బడ్జెట్‌లో పరిహారానికి సంబంధించిన నిధులు బడ్జెట్‌లో కేటాయించేలా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళతామన్నారు. ప్రభుత్వం ఏర్పడిన 220 రోజుల్లోనే జమ్మలమడుగు నియోజకవర్గంలో 1000 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ ఇప్పించామన్నారు.అలాగే 220 ట్రాన్స్‌ఫార్మర్లు మం జూరయ్యాయన్నారు.కొండాపురం, లావనూరులకు నూతన సబ్‌స్టేషన్‌లు మంజూరయ్యాయని తెలిపారు.

మత్స్యకారుల అభివృద్ధికి కృషి ..: ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి తెలిపారు. ప్రధాన మంత్రి మత్స్యసంపద యోజన క్రింద 4,50,000 చేపపిల్లలను బుధవారం గండికోట బ్యాక్‌వాటర్‌లో వదిలే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.మత్స్యకారులు ప్రతి ఒక్కరూ లైసెన్సులు తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. లైసెన్సు ఉంటే ప్రమాదబీమాతో పాటు, 50 ఏళ్లకే పెన్షన్ పొందవచ్చునన్నారు. గండికోట ప్రాజెక్టులో స్థానికులే చేపలవేటకు వెళ్లాలని, స్థానికేతరులు వెళితే స్థానిక మత్స్యకారులు అడ్డుకొని పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. మండల కూటమి ఇన్‌చార్జి శివ నారాయణరెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు నాగేశ్వర్ రెడ్డి, కూటమి నాయకులు లావనూరు నారాయ ణరెడ్డి, శంకర్‌రెడ్డి, రామాంజులరెడ్డి, నరసింహారెడ్డి, విశ్వనాథరెడ్డి, చామల బాబురెడ్డి,రామలింగేశ్వరరెడ్డి, మాధవరెడ్డి, బాలనాగిరెడ్డి, రామసుబ్బారెడ్డి, అరుణ్ కుమార్‌రెడ్డి, ఫిషరీస్ డీడీ శాంతి, ఎంపీడీవో నాగప్రసాద్ ఫిషరీస్ అసిస్టెంట్ మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.



గండికోట బ్యాక్‌వాటర్‌లో చేపపిల్లలను వదులుతున్న జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

హుండీ ఆదాయం లెక్కింపు

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): రామేశ్వరంలోని ముక్తిరామలింగేశ్వర స్వామి ఆలయంలో హుండీ ఆదాయాన్ని లెక్కించారు. బుధవారం ముక్తిరామలింగేశ్వరస్వామి, కాశీ అన్నపూర్ణాదేవి సమేత హనుమత్ లింగేశ్వరస్వామి ఆలయాల్లో 18 నెలలకు భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించారు. రూ.6,51,240లను కానుకల రూపంలో భక్తులు స్వామివారికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ ఎం.రాజారెడ్డి, ఈవో శ్రీధర్, పాలక మండలి సభ్యులు, దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, భక్తులు, అర్చకులు పాల్గొన్నారు.

నియామకాలు వెంటనే చేపట్టాలి

జమ్మలమడుగు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): ఎల్‌ఐసీలో తక్షణమే నూతన నియామకాలు చేపట్టాలని జమ్మలమడుగు ఎల్‌ఐసీ బ్రాంచ్ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి సతీష్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన ఎల్‌ఐసీ కార్యాలయం వద్ద బ్రాంచ్ ఉపాధ్యక్షుడు నరసింహం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండు సంవత్సరాల్లోనే 5,400 మంది సిబ్బంది ఎల్‌ఐసీలో సంఖ్య తగ్గిందన్నారు. రాబోయే రెండు మూడు సంవత్సరాల్లో పెద్ద సంఖ్యలో సిబ్బంది రిటైర్డు అవుతున్నారన్నారు. క్లాస్-3, 4 క్యాడర్లలో తక్షణమే రిక్రూట్‌మెంట్ చేపట్టాలని అన్నారు. నిరసన కార్యక్రమంలో యూనియన్ నాయకులు అధ్యక్షుడు బాలరాజు, బ్రహ్మయ్య, హరినాయక్ పాల్గొన్నారు.

309 మద్యం సీసాలు స్వాధీనం

అట్లూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలో బుధవారం నబియాబాద్ వద్ద అక్రమంగా ఆటోలో తరలిస్తున్న 309 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని ఆటోడ్రైవరు సంగటి నాగరాజును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ ఐ రామక్రిష్ణ తెలిపారు. ఎస్‌ఐ సమాచారం మేరకు కేఎంఆర్ వైన్‌షాపు నిర్వహిస్తున్న మేనేజరు నరసింహ అక్రమంగా మద్యాన్ని తరలిస్తున్నట్లు తెలిపారు. నిందితునిపై కేసు నమోదు చేసి రిమాండుకు పంపినట్లు తెలపారు. కాగా స్వాధీనం చేసుకున్న మద్యం విలువ రూ.45వేలు ఉంటుందని తెలిపారు. ఎవరైనా అక్రమంగా మద్యం తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ హెచ్చరించారు.



కేలండర్ ఆవిష్కరణ

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): టీఎన్‌ఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌ఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు చేతన్, రాజేష్, రాజు, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

లేగదూడలను సంరక్షించుకోవాలి

పోరుమామిళ్ల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : లేగదూడలను సంరక్షించుకోవాలని పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి శారదమ్మ అన్నారు. మండల పరిధిలోని క్రిష్ణంపల్లెలో బుధవారం రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆంధ్రప్రదేశ్ పశుసంవర్ధకశాఖ, పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కృత్రిమ గర్భధారణ ద్వారా పుట్టిన లేగదూడల ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో దూడలను పరిశీలించి ఆరోగ్యంగా ఉండే మొదటి, ద్వితీయ, తృతీయ దూడల యజమానులకు జిల్లా పశు సంవదర్ధకశాఖ అధికారి శారదమ్మ బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చంద్రశేఖర్, మహేశ్వర్‌రెడ్డి, , పశువైద్యాధికారి శివ శ్రీనివాసరెడ్డి, శరత్, టీడీపీ నాయకుడు కొండా రామక్రిష్ణరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

నట్టల నివారణ మందుల పంపిణీ

ప్రొద్దుటూరు రూరల్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పశు ఆరోగ్య శిబిరాలకు విశేష స్పందన లభిస్తోంది. బుధవారం మండల పరిధిలోని పెద్దశెట్టిపల్లె గ్రామంలో పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకుడు ధనుంజయరెడ్డి ఆధ్వర్యంలో బుద్దాయపల్లె వైద్యశాల డాక్టర్ పి.సరస్వతి, జేడీవో సదాశివయ్య సిబ్బందితో కలిసి వైద్యసేవలు అందించారు. ఈ శిబిరంలో నట్టల నివారణ మందులను తాపించినట్లు వివరించారు.

ఉచిత పశువైద్యశిబిరం విజయవంతం

కొండాపురం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి):మండలంలోని పెంజి అనంతపురం గ్రామంలో బుధవారం ఉచిత పశువైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలోని దూడలకు నట్టల నివారణ మందును తాపించారు. గొర్రెలు, మేకలకు డీవార్మింగ్ మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి డాక్టర్ రాజశేఖర్‌రాజు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పింఛన్‌దారులను పరిశీలించిన వైద్యులు

దువ్వూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు మండలంలోని 13 గ్రామాల్లో పింఛన్‌దారులను రిమ్స్ ప్రధాన వైద్యులు మహిధర్‌రెడ్డి, ఉజ్వల బుధవారం పరిశీలించారు. వీరు సదరు పింఛనుకు అర్హులా కాదా అనే విషయాన్ని ఆరా తీశారు. మండలంలోని 13 గ్రామాల్లో 23 మంది అర్హతలను పరీక్షించారు. అనారోగ్యపరంగా 15 వేల పింఛన్‌కు అర్హులా కాదా అనే విషయాన్ని ఆరా తీశారు. వీరి వెంట స్థానిక వైద్యులు పాల్గొన్నారు.

నేడు సాంఘిక శాస్త్ర ప్రతిభా పరీక్ష

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): నేతాజీ జయంతిని పురస్కరించుకుని గురువారం 10వ తరగతి విద్యార్థులకు జిల్లాస్థాయి సాంఘిక శాస్త్ర ప్రతిభా పరీక్ష నిర్వహిస్తున్నట్లు నేతాజీ సోషియల్ స్టడీస్ క్లబ్ అధ్యక్షుడు గురుకుమార్, కన్వీనర్ భాస్కరరావులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, జడ్పీ, మున్సిపల్ ఎయిడెడ్ పాఠశాలల 10వ తరగతి విద్యార్థులకు గురువారం ఉదయం 10 గంటలకు పీఎన్‌ఆర్ ఫంక్షన్ హాలులో ప్రతిభా పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు మొదటి బహుమతి రూ.3 వేలు, రెండో బహుమతి రూ.2 వేలు, మూడో బహుమతి రూ.1500, కన్సొలేషన్ బహుమతులను అందజేస్తామని తెలిపారు.

టీడీపీ శాశ్వత సభ్యత్వ నమోదు



విజయమ్మ సమక్షంలో శాశ్వత సభ్యత్వ నమోదు చేసుకున్న టీడీపీ నాయకులు

అట్లూరు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : బద్వేలు నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో టీడీపీ నాయకులు టీడీపీ శాశ్వత సభ్యత్వ నమోదు ఇప్పటి వరకు 36 మంది నమోదు చేసుకున్నారు. నమోదు చేసుకున్నవారిలో అట్లూరు మండల టీడీపీ నాయకులు 11 మంది ఒక్కొక్కరు రూ.లక్ష చెల్లించి శాశ్వత సభ్యత్వ నమోదు చేసుకుని అట్లూరు టీడీపీ నాయకులు ముందంజలో ఉన్నట్లు తెలిపారు. బుధవారం మాజీ ఎమ్మెల్యే విజయమ్మ ఇంటి వద్ద ఆమె సమక్షంలో అట్లూరు మండలానికి చెందిన మద్దిక పుల్లారెడ్డి, మాచునూరు మీనాక్షిరెడ్డి రూ.లక్ష చెల్లించి శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు రెడ్డయ్య, పాలకొండు రాజశేఖర్, నవీన్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, పెంచలయ్య, టీడీపీ కార్యకర్తలు ఉన్నారు.

స్టీల్‌ప్లాంట్ విషయంలో నిర్లక్ష్యం తగదు



మాట్లాడుతున్న ప్రతాప్‌రెడ్డి

జమ్మలమడుగు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): కడప రాయలసీమ హక్కు స్టీల్‌ప్లాంట్ నిర్మాణం విషయంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం నిరుద్యోగులను మోసం చేయడమేనని రాయలసీమ పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ప్రతాప్‌రెడ్డి విమర్శించారు. బుధవారం డివిజన్ కేంద్రమైన జమ్మలమడుగు ఐటీఐ కళాశాలలో విద్యార్థులతో స్టీల్‌ప్లాంట్‌కు సంబంధించి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ తరతరాలుగా రాయలసీమకు జరుగుతున్న మోసాలకు కొనసాగింపుగా ప్రస్తుత చర్యలు ఉన్నాయని, కడప స్టీల్‌ప్లాంట్‌కు బదులుగా ఆంధ్ర ప్రాంతంలో అనకాపల్లిలో కొత్తగా స్టీల్ ప్లాంట్ ప్రకటన దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

వేగం కన్నా ప్రాణం మిన్న



నాలుగురోడ్ల కూడలిలో మానవహారం నిర్వహిస్తున్న పోలీసులు, విద్యార్థులు

బద్వేలుటౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : వేగం కన్నా ప్రాణం మిన్న అని బద్వేలు అర్బన్‌సీఐ రాజగోపాల్ అన్నారు. బుధవారం రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులతో కలసి ప్లకార్డులు చేతబట్టి నాలుగు ప్రధాన రహదారుల్లో రోడ్డు భద్రతా నిబంధనలను పాటించాలంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. అనంతరం నాలుగురోడ్ల కూడలిలో విద్యార్థులు పోలీసు సిబ్బందిచే మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు సత్యనారాయణ, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు అర్బన్..: ట్రాఫిక్ రూల్స్ పాటించి ప్రమాదాలను నివారించాలని ఆర్డీవో మురళీధర్, ట్రాఫిక్ సీఐ దేవకుమార్ పేర్కొన్నారు. పట్టణంలో బుధవారం వివిధ కళాశాల, పాఠశాల విద్యార్థులతో వాహనదారులకు రాజీవ్ సర్కిల్ నుంచి శివాలయం సర్కిల్ తిరిగి రాజీవ్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు.

మహిళలపై దాడులు అరికట్టాలి

బద్వేలు, జనవరి22(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం మహిళలు, బాలికలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా అధ్యక్ష, కార్యదర్శులు సుబ్బమ్మ, ముంతాజ్ పేర్కొన్నారు. బుధవారం సుందరయ్య భవనంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ సమాజంలో మహిళలపై నానాటికీ దాడులు పెరిగిపోతున్నాయన్నారు. కార్యక్రమంలో మహిళా సంఘం నాయకులు పాల్గొన్నారు.

పలు సమస్యలపై కార్యకర్తలతో భూపేశ్ ఆరా



కార్యకర్తలతో సమావేశమైన భూపేశ్‌రెడ్డి

జమ్మలమడుగు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు టీడీపీ కార్యాలయంలో బుధవారం టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి కార్యకర్తలతో మాట్లాడారు. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుంచి అనేక సమస్యలపై కార్యకర్తలు, నాయకులు భూపేశ్‌రెడ్డితో సమావేశం అయ్యారు. కార్యకర్తల సమస్యల పరిష్కారం కోసమే నిత్యం అందుబాటులో ఉంటున్నానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పలు ప్రాంతాల టీడీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం

ముద్దనూరు జనవరి22 (ఆంధ్రజ్యోతి):ప్రతీ మూడు నెలలకు ఒకసారి గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక వసతులు, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు తదితర అంశాలపై ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే మండల సర్వసభ్యసమావేశానికి ఎంపీపీ కుడుముల ప్రదీప్‌కుమార్‌రెడ్డి గైర్హాజరడంతో ప్రజల నుంచి పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్థానిక ఎంపీడీవో సభాభవనంలో బుధవారం ఎంపీడీవో ముకుందారెడ్డి ఆధ్వర్యంలో మండల సర్వసభ్యసమావేశం నిర్వహించారు.ఈ సమావేశం ఎంపీపీ ప్రదీప్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన జరగాల్సి ఉండగా ఆయన గైర్హాజరయ్యారు. కాగా సమావేశం సాదాసీదాగా జరిగింది. కార్యక్రమంలో ఎంపీడీవో ముకుందారెడ్డి,ఎంపీటీసీ లక్ష్మీకాంతమ్మ,సర్పంచ్ బోనం సరళ,ఏవో వెంకటకృష్ణారెడ్డి, పశుసంవర్ధకశాఖ ఏడీ వాసాశ్రీనివాస,ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాసరాజా వర్మపలు శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అర్హులందరికీ నష్టపరిహారం



రైతుల వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీవో చంద్రమోహన్

పోరుమామిళ్ల, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం అందేలా చూస్తామని ఆర్డీవో చంద్రమో హన్ అన్నారు. బుధవారం ఆయన పోరుమామిళ్ల మండలంలోని నర్సింగపల్లె పుల్లీడు, చెన్నారెడ్డిపేట, రంగసముద్రం, చెర్లోపల్లె ప్రాంతాల్లో పరిశీలించి అక్కడ రైతులతో మాట్లాడారు. ఎవరైనా నష్టపరిహారం అందని వారు తమ కార్యాలయంలో సంప్రదించాలని వాటికి సంబంధించిన రికార్డులను రెవెన్యూ అధికారులకు అప్పజెప్పాలన్నారు. పనులను కూడా కొనసాగిం చాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్ఐ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో వెంగమునిరెడ్డి

బ్రహ్మంగారిమఠం, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): నిరక్షరాస్యులను అక్షరా స్యులుగా తీర్చిదిద్దడమే ఉల్లాస్ కార్యక్రమం ఉద్దేశ్యమని ఎంపీడీవో వెంగమునిరెడ్డి అన్నారు. బుధవారం బ్రహ్మంగారిమఠం మండల కేంద్రంలోని ఎంపీడీవో సభాభవనంలో ఉల్లాస్ కార్యక్రమంపై గ్రామ వలంటీర్లకు శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టారు. శిక్షణ తరగ తుల్లో ఎంపీడీవో వెంగమునిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి గ్రామంలో నిరక్షరాస్యులుగా ఉన్నవారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకే ఉల్లాస్ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టడం జరిగిందని ఎంపీడీవో తెలిపారు. అనంతరం శిక్షణ తరగతుల్లో వలంటీర్లకు నోటుబుక్కులు, శిక్షణ సామగ్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ రంగయ్య, ఏవో మల్లికార్జునరావు, వెలుగు సీసీలు భాస్కర్, బాలయ్య, నారాయణ, గ్రామ సంఘం అసిస్టెంట్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామికి విశేషపూజలు



అయ్యప్పస్వామి పూజలో పాల్గొన్న స్వామివారి కంకణధారులు

బద్వేలుటౌన్, జనవరి 22 (ఆంధ్రజ్యోతి) : మున్సిపాలిటీ పరిధిలోని నెల్లూరురోడ్డు నాగుల చెరువుకట్ట సమీపంలో అయ్యప్పస్వామి ఆలయ పునఃప్రతిష్ట నిర్వహించి నేటికి 40 రోజులు పూర్తి అయిన సందర్భంగా తెల్లవారు జాము నుంచే వరసిద్ధి వినాయకస్వామికి, హరిహరసుతుడు అయ్యప్పస్వామికి, సుబ్రమణ్యస్వామి విశేషద్రవ్యాలతో, పలురకాల పూలతో వేదమంత్రాల మధ్య భక్తులు తిలకిస్తుండగా అభిషేకాలు నిర్వహించారు. అనంతరం కంకణధారులచే స్వామివారికి విశేషపూజలు నిర్వహించి స్వామివారికి యాగశాలలో మహాగణపతిహోమం, రుద్రహోమం, నవగ్రహ హోమం, లక్ష్మీకుబేరహోమం, తదితర పూజా కార్యక్రమాలను అట్టహాసంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్పస్వామి ఆలయ అధ్యక్షుడు రాగిమాను ప్రతాప్‌కుమార్, రామలక్షుమ్మ, ప్రభాకర్, మునెయ్య, అన్నంరెడ్డి రమణారెడ్డి, జయసుబ్బారెడ్డి, సుబాష్, కామేష్, మునెయ్య, వెంకటేశ్వర్లు, రాఘవేంద్ర, చిట్టి, రవితేజ, రామక్రిష్ణ, మునెయ్య పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ కార్యదర్శుల నూతన సంఘం ఎంపిక

ముద్దనూరు జనవరి22(ఆంధ్రజ్యోతి):స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఈవోపీఆర్డీ వీరభద్రుడు ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు నూతన కమిటీ ఎంపిక చేశారు.అధ్యక్షుడుగా అనిల్‌కుమార్‌రెడ్డి,ఉపాధ్యక్షుడుగా వినోద్‌కుమార్,గౌరవ అధ్యక్షుడుగా నరసింహులు, జనరల్ సెక్రటరీగా విజయభారతి, కోశాధికారిగా విద్యాసాగర్‌ను ఎన్నుకున్నట్లు ఈవోపీఆర్డీ తెలిపారు.



నిర్వాసితుల ఆధార పత్రాల పరిశీలన

● భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు ● మధ్యాహ్నం దాకా కౌంటర్లు ఖాళీ
● నలుగురు నిర్వాసితులు మాత్రమే రాక

జమ్మలమడుగు, జనవరి 22 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయ సభాభవనంలో బుధవారం ఉదయం 9.30 గంటలకు గండికోట ప్రాజెక్టు కింద ముంపునకు గురైన కొండాపురం మండలం పి.అనంతపురం గ్రామానికి చెందిన నిర్వాసితులు వారి వారి ఆధార పత్రాలను పరిశీలించుకొనుటకు రెవెన్యూ అధికారులు ఏర్పాట్లు చేశారు. గతంలో గైర్హాజరైన 152 మంది పీడీఎఫ్ఎస్‌కు ప్రత్యేక గ్రీవెన్‌డే జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయ సభాభవనంలో ఏర్పాటు చేయడం జరిగింది. అయితే ఆర్డీవో కార్యాలయం వద్దకు కొండాపురం నిర్వాసితులు పి.అనంతపురం గ్రామానికి చెందిన బాధితులు వస్తారని, ఏదైనా గొడవలు చోటు చేసుకుంటాయేమోనని భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. దీంతో జమ్మలమడుగు పట్టణంలో హంగామా నెలకొంది. ఉదయం 10.30 గంటలకు డీఎస్పీ వెంకటేశ్వరరావు సభాభవనం వద్ద ఏర్పాటు చేసిన నాలుగు కౌంటర్లను సందర్శించారు. అక్కడే పోలీసు అధికారులతో ఆయన మాట్లాడారు. ఆయనతోపాటు అర్బన్ సీఐ లింగప్ప, ఎస్‌ఐ రామకృష్ణ, పోలీసు సిబ్బంది సుమారు 12 మందికిపైగా ఏర్పాటు చేశారు.

● ఆర్డీవో కార్యాలయ సభాభవనంలో నిర్వాసితుల కోసం ఆధార పత్రాల పరిశీలనకు నాలుగు కౌంటర్లు ఏర్పాటు చేశారు. బయట ఒక కౌంటర్ ఏర్పాటు చేయడం జరిగింది. అక్కడే భారీగా పోలీసు బందోబస్తు. మధ్యాహ్నం వరకు కౌంటర్లు ఖాళీగా దర్శనమిచ్చాయి. అప్పుడప్పుడు పి.అనంతపురం గ్రామానికి చెందిన 152 మందికిగాను నలుగురు మాత్రమే సాయంత్రం 5.30 గంటల వరకు హాజరైనట్లు కౌంటర్-1లో ఉండే అధికారి డిప్యూటీ తహసీల్దారు వేణు తెలిపారు. దీంతో నిర్వాసితుల పరిశీలన కార్యక్రమం సాయంత్రానికి ముగిసింది. అధికారులంతా పోలీసు సిబ్బంది మొత్తం హాజరవుతారని ఎదురుచూశారు.

కానీ నలుగురు మాత్రమే హాజరుకావడం, ఎవ్వరూ రాకపోవడంతో అనేక విమర్శలు వెల్లువెత్తాయి. పూర్తిగా ఆధారాలు ఉంటే నిర్వాసితులు వచ్చేవారని, ఉదయం నుంచి సాయంత్రం 5.30 గంటలు ఉంటే నలుగురు మాత్రమే హాజరుకావడం అధికారులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు.



నిర్వాసితుల ఆధార పత్రాలు పరిశీలిస్తున్న డీటీ వేణు